PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 350 | విజయవాడ, సోమవారం 21 జులై 2025 | 6+ 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 21 July 2025 | Rs

మురళీ శ్రీశంకర్ 'సూపర్' జంప్..

- పోర్చుగల్ అథ్లెటిక్స్‌లో విజయం

6

పిండిమరకు రూ.24 వేల విద్యుత్ బిల్లు

ప్రజాశక్తి-సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన పిండిమర నిర్వాహకులు కోట సీతారామస్వామికి అదానీ స్మార్ట్ మీటర్ షాకిచ్చింది. సాధారణ మీటరు ఉన్నప్పుడు ఆయనకు గతంలో నెలకు రెండు వేల నుంచి మూడు వేల రూపాయలలోపు బిల్లు వచ్చేది. విద్యుత్ శాఖాధికారులు అదాని స్మార్ మీటరు బిగించిన తర్వాత బిల్లు పెరుగుతూ వచ్చింది. తొమ్మిది వేల రూపాయల వరకూ బిల్లు వచ్చేది. గత నెల ఒక్కసారిగా రూ.24,360 బిల్లు వచ్చింది. దీంతో, ఆయన విద్యుత్ శాఖాధికారులను సంప్రదించారు. ఎంత బిల్లు వస్తే అంత కట్టాల్సిందేనని వారు తేల్చి చెప్పారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 25వ వార్డు గుండిపూడివారి వీధిలో సిపిఎం నిర్వహించిన ప్రచారంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మిల్లుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఇతర నాయకులు వెళ్లినప్పుడు పిండిమర నిర్వాహకుడు తనకు వచ్చిన అధిక బిల్లు విషయం వారి దృష్టికి తీసుకెళ్లారు. రోజుకు దాదాపు రూ.వెయ్యి చొప్పున వచ్చిన బిల్లును ఎలా కట్టగలగని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటరును తీసేసి పాతమీటరును పెట్టాలని ఆయన కోరారు.

నేటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

- 17 బిల్లులు ఆమోదానికి ప్రభుత్వం యోచన
- పహల్గాం దాడిపై ప్రతిపక్షాల డిమాండ్‌తో చర్చకు అంగీకారం
- వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయనున్న ప్రతిపక్షాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21 వరకు సమావేశాలు జరగనున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తరువాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమవుతున్నాయి. 21 రోజులపాటు జరగనున్న ఈ సమావేశాలు వాడీవేడిగా కొనసాగే అవకాశాలు న్నాయి. పార్లమెంటు ఉభయ సభల్లో 8 కొత్త బిల్లులతో సహా 17 బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, జియో హెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్ (సంరక్షణ, నిర్వహణ) బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, నేషనల్ యాండీ డోపింగ్ (సవరణ) బిల్లు, మణిపూర్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు వంటివి ఇందులో ఉన్నాయి. వీటితోపాటు ఇన్‌కం ట్యాక్స్-2025 బిల్లును కూడా కేంద్రం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించే తీర్మానం కూడా ఈ సమావేశాల్లోనే పార్లమెంటు ముందుకు రానుంది. కాగా, ఆపరేషన్ సిందూర్ తరువాత ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ఇండియా బ్లాక్ పార్టీలు పట్టుబట్టాయి. కానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధ పడలేదు. భారత్, పాక్ కాల్పుల్లో 5 యుద్ధ విమానాలు నేలకూలాయని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, కాల్పుల విరమణ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు నిలదీయనున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశాలపై ప్రతిపక్షాలు చర్చలకు పట్టుబట్టే అవకాశాలున్నాయి. వీటితో పాటు మహిళలపై దాడులు, నిరుద్యోగం, ధరలు పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన ఘటన వంటి అంశాలపై ప్రతిపక్షాలు లేవనెత్తేందుకు సిద్ధపడ్డాయి.

వాడివేడిగా అఖిలపక్ష సమావేశం

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలోనే స్పష్టమైంది. సమావేశం అసాంతం వాడివేడిగా సాగినట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడి, అనంతర పరిణామాలపై పార్లమెంటులో చర్చించాల్సిందేనని, అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటు ఉభయ సభలు సజావుగా నిర్వహించేందుకు ప్రతిపక్షాల సహకారం కోసం ఆదివారం ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. కేంద్ర మంత్రి జెపి నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 51 రాజకీయ పార్టీలకు చెందిన 54 మంది నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రతిపక్షాలు పహల్గామ్, ఆపరేషన్ సిందూర్, డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన, బీహార్ ఓటర్ల జాబితా, మణిపూర్ అశాంతి, నిరుద్యోగం, రైతులు, దేశ, విదేశాంగ విధానం తదితర అంశాలు లేవనెత్తాయి. అయితే, సభ సజావుగా జరిగేలా చూడాలని ప్రభుత్వం ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేసింది. సమావేశంలో ఆయా అంశాలపై నిర్మాణాత్మక చర్చకు హామీ ఇచ్చింది. అనంతరం కాంగ్రెస్ నేతలు ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ పహల్గామ్, దానిపై లెఫ్టినెంట్ గవర్నర్ ఇచ్చిన ప్రకటక తీవ్రమైందన్నారు. ప్రభుత్వం దీనిపై మిగతా 2లో

రాష్ట్రంలో పిడుగులతో కూడిన భారీ వర్షాలు

- నేడు ప్రకాశం బ్యారేజీ నుంచి 3వేల క్యూసెక్కుల నీటి విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21న విశాఖపట్టణం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

నిండిన ప్రకాశం బ్యారేజ్

నిరంతరం వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తోందని, కెపాసిటీ 12 అడుగులు కాగా, ప్రస్తుతం రిజర్వాయర్ నిండిందని ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈనెల 21న ఉదయం 6 గంటలకు సుమారు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు కృష్ణా సెంట్రల్ డివిజన్ రివర్ కన్జర్వేటర్ ఇఇ తెలిపారు. నీటిని విడుదల చేస్తున్న సందర్భంగా ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటిలో చేపలు పట్టడం, ఈతకు వెళ్లడం లాంటివి చేయవద్దని, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు నదిలో ప్రయాణించవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

బలవంతపు భూ సేకరణ ఆపాలి

- 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి
- కార్పొరేట్ కంపెనీలకు భూ పందేరాన్ని మానుకోవాలి
- దశల వారీగా కార్యాచరణ
- ఆగస్టు 25న కలెక్టరేట్ల ముందు ధర్నా
- ఎపి రైతు సంఘం రాష్ట్ర సదస్సు తీర్మానం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక భూసేకరణ విధానాలపై ఆదివారం నంద్యాలలోని నేషనల్ పిజి కాలేజీలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. కార్పొరేట్ కంపెనీలకు లక్షల ఎకరాలు కట్టబెట్టే భూ పందేరాన్ని మానుకోవాలని, రీ సర్వేలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సదస్సు డిమాండ్ చేసింది. సర్వీస్ ఇనాం భూములపై పేదలకు హక్కు కల్పించాలని, చుక్కల భూములు, 22ఎ నిషేధిత భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, దేవాలయ భూములు సాగు చేస్తోన్న చిన్న, సన్నకారు రైతులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని, బహిరంగ వేలం నుండి మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సదస్సు డిమాండ్ చేసింది. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. ఈ నెలాఖరిలోగా అన్ని జిల్లాల్లో భూ సదస్సులు నిర్వహించాలని, ఆగస్టు 15లోపు అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరిపి అడ్డగోలు భూసేకరణను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 18న గ్రామ సచివాలయాల్లో రైతుల సంతకాలతో వినతిపత్రాలు ఇవ్వాలని, ఆగస్టు 25న కలెక్టరేట్ల ముందు ధర్నా చేయాలని తీర్మానించింది. సెప్టెంబర్ ఎనిమిదిన రహదారుల దిగ్బంధనం చేపట్టాలని, 15న నిర్మాణ పనుల నిలుపుదల ఉద్యమం చేపట్టాలని సదస్సు నిర్ణయించింది. ఈ సదస్సులో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ మాయాజాలంలో పడుతున్న రైతులను చైతన్య పరచాలని, సంఘటితమైన ప్రతిఘటన నిర్మించాలని పిలుపునిచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా రైతులకు పెట్టుబడి సాయం దక్కడం లేదని, ఇదేనా మంచి ప్రభుత్వం అంటే అని ప్రశ్నించారు. సోలార్, గ్రీన్, హైడ్రో ఎనర్జీల పేరుతో లక్షల ఎకరాల భూములు కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. రైతుల అనుమతి లేకుండా ఏకపక్షంగా రైతులను బలిపీఠం మీద పెడుతున్నారని వివరించారు. మా భూమి మాకు కావాలని రైతులు ప్రశ్నించాలన్నారు. టిడిపి, వైసిపి ఏ పార్టీ అయినా కార్పొరేట్ల ముద్దుబిడ్డలని, వాటి ద్రోహానికి వ్యతిరేకంగా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. బలవంతపు భూ సేకరణపై అన్ని జిల్లాల్లో రైతులను, రైతు కూలీలను సన్నద్ధం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య తెలిపారు. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల భూమిని సేకరిస్తున్నారని, అందుకోసం చట్టాలను మారుస్తున్నారని అన్నారు. మార్పుల చక్రం కింద రైతులు పడకుండా కాపాడుకోవాలని మిగతా 2లో

మిథున్‌రెడ్డికి 1 వరకు రిమాండ్

- రాజమండ్రి జైలుకు తరలింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లిక్కర్ కేసులో వైసిపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టు ఆగస్టు ఒకటి వరకు రిమాండ్ విధించింది. ఆయనను ఆదివారం సాయంత్రం రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. తొలుత వైద్య పరీక్షల కోసం విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఆయనను ఎసిబి కోర్టులో ప్రవేశపెట్టారు. మిథున్‌రెడ్డి అరెస్టుకు 29 కారణాలను సిట్ అధికారులు కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఈ కేసులో ఎ-4గా ఉన్న ఆయనపై సెక్షన్లు 409, 420, 120(బి), రెడ్‌విత్ 34, 37, ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్ 7, 7ఎ, 8, 13(1)(బి), 13(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సిట్ తరపున కోటేశ్వరరావు, మిథున్‌రెడ్డి తరపున సీనియర్ అడ్వకేట్ నాగార్జున రెడ్డి వాదనలు వినిపించారు. సిట్ తరపున అడ్వకేట్ వాదనలు వినిపిస్తూ.. లిక్కర్ స్కామ్‌లో మిథున్‌రెడ్డిది కీలకపాత్ర అని, లిక్కర్ స్కామ్ మనీ ట్రైల్‌లో ఆయన పాత్రపై స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని అన్నారు. మిథున్‌రెడ్డి తరపున అడ్వకేట్ నాగార్జునరెడ్డి వాదనలు వినిపిస్తూ రిమాండ్ విధించే పక్షంలో నెల్లూరు జైలుకు పంపాలని, ఆయన వై కేటగిరి భద్రతలో ఉన్నందున ప్రత్యేక బ్యారెక్‌లోకి తరలించాలని కోరారు. అరెస్టు సమాచారాన్ని లోక్‌సభ స్పీకరుకు ముందస్తుగా తెలపలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. సిట్ తరపున అడ్వకేట్ గుంటూరు జైలుకు పంపాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. చివరికి ఎసిబి కోర్టు రాజమండ్రి జైలుకు తరలించాలని పోలీసులను ఆదేశించింది. ఇదే సందర్భంలో తనకు రక్తం గడ్డకట్టే వ్యాధి (బ్లడ్ క్లాట్స్) ఉన్న దృష్ట్యా ఆస్పత్రిలో చికిత్స అందించాలని మిథున్‌రెడ్డి.. న్యాయస్థానానికి విన్నవించుకున్నారు.

రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

రాజకీయ కుట్రలో భాగమే : వైసిపి అధినేత వైఎస్ జగన్

రాజకీయ కుట్రలో భాగంగానే వైసిపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని తప్పుడు కేసులో ఇరికించి జైలుకు పంపారని వైసిపి అధినేత జగన్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తున్నామన్నారు. బెదిరింపులు, హింస, లంచాలు, ప్రలోభాలతోనే ఈ కేసు అని పేర్కొన్నారు. ప్రజల తరపున పోరాడే వారి గొంతు మూయించే కార్యక్రమం తప్ప మరొకటి కాదన్నారు. వరుసగా మూడు సార్లు ఎంపిగా ఎన్నికైన మిథున్‌రెడ్డిని బలవంతపు వాంగ్మూలాల ద్వారా తప్పుడు కేసులో ఇరికించారన్నారు.

కక్ష సాధింపులో భాగంగానే.. : పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

టిడిపి కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగానే తన కుమారుడు ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేసిందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. తమ కుటుంబం మీద ఉన్న కక్ష, విద్వేషంతోనే ఇలా కేసులు పెడుతున్నారని ఓ వీడియో సందేశంలో ఆదివారం ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ ఏ విధంగా ఇబ్బందులు పెడుతున్నారో చూస్తున్నామని, దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గతంలోనూ ఎయిర్‌పోర్ట్ మేనేజరును కొట్టారని మిథున్‌రెడ్డిపై కేసు పెట్టారని, అది తప్పుడు కేసుగా తేలిందని గుర్తు చేశారు.

అక్రమ అరెస్టులు : సజ్జల

లిక్కర్ స్కామ్ పేరుతో అక్రమ అరెస్టులు చేస్తున్నారని వైసిపి రాష్ట్ర సమన్వయకర్త మిగతా 2లో

తిరోగామి శక్తులపై సాహిత్యరంగంలోనే తీవ్ర పోరాటం

- సర్వ ప్రక్రియలు ప్రజా ఉద్యమం కోసమే
- 'తెలకపల్లి రవి రచనలు' ఆవిష్కరణ సభలో వక్తలు

2

బల్క్ డ్రగ్ పార్కుకు భూములిచ్చేది లేదు

- జానకయ్యపేటలో భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

3

అభివృద్ధి పేరుతో పంట పొలాలను లాక్కోవద్దు

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

కదులుతున్న డొంక

- యాక్సిస్ బ్యాంక్ స్కామ్ కేసులో దర్యాప్తు ప్రారంభం
- బ్యాంకు అధికారులను విచారించిన డిఎస్‌పి
- కలకలం రేపిన 'కుబేర @నెల్లూరు' కథనం
- బాధితులకు బెదిరింపులు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

నెల్లూరు యాక్సిస్ బ్యాంక్‌లో చోటుచేసుకున్న భారీ స్కామ్ డొంక కదులుతోంది. 'కుబేర @ నెల్లూరు ' శీర్షికతో ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురితమైన కథనం కలకలం రేపింది. జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఏడు నెలల క్రితమే ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకువేయని పోలీస్ శాఖ ఉలికిపడింది. ఆ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకున్నారు. దర్యాప్తు జరుగుతున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పై నుండి అందిన ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు స్వయంగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ స్కామ్‌లో బాధితులైన గిరిజనులకు బెదిరింపులు వస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడాలని భావించిన బాధితులను ఎక్కడికక్కడ అడ్డుకున్నట్లు తెలిసింది. అయినా, ఆదివారం నాడు విడవలూరులో మరో కేసు నమోదైంది.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తును ప్రారంభించిన రూరల్ డిఎస్‌పి ఆదివారం అయినప్పటికీ బ్యాంకు సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. వారి నుండి వివరాలు సేకరించారు. ఏం జరిగింది? ఎలా జరిగిందన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుల వివరాలతో పాటు, డబ్బు కాజేసిన వ్యక్తుల వివరాలను కూడా బ్యాంకు మేనేజర్ మల్లిపల్లి మధన్‌మోహన్‌రావు డిఎస్‌పికి అందజేశారు. పోలీసు అధికారులు ఇప్పటికైనా దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించడం పట్ల బ్యాంకు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

'ఆ' నలుగురే కీలకమా...?

ఏడు నెలల క్రితం ఇచ్చిన ఫిర్యాదులో బ్యాంకు అధికారులు నెల్లూరు నగరానికి చెందిన జాలే వాసుదేవనాయుడు, అల్లాభక్ష శివకుమార్, వెంకటేష్‌ల పేర్లను నిందితులుగా పేర్కొన్నారు. వీరిలో జాలే వాసుదేవనాయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు ఒక యు ట్యూబ్ ఛానల్ కూడా నిర్వహించేవాడు. మరో నిందితుడు అల్లాభక్ష జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగానికి నాయకుడిగా గతంలో వ్యవహరించేవాడని చెబుతున్నారు. ఈ స్కామ్‌లో వీరిద్దరు ప్రధానమని, మిగిలిన ఇద్దరు వీరి స్నేహితులని చెబుతున్నారు. అయితే, ఇంత పెద్ద స్కామ్‌ను వీరు నలుగురే చేశారా... వీరి వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న అంశంపై సందేహాలు నెలకొన్నాయి. ఆధునీకరణలో భాగంగా తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంలోని లోపాలను బ్యాంకు సిబ్బంది చెప్పి ఉంటారని భావిస్తున్నారు.

జిల్లాకే పరిమితం కాదు...

నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ మిగతా 2లో

బాధితులకు న్యాయం చేయాలి -సిపిఎం డిమాండ్

యాక్సిస్ బ్యాంకు స్కామ్‌లో బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం.రమేష్ విడుదల చేసిన ప్రకటనలో స్కామ్‌లో పాత్రధారులతో పాటు, సూత్రధారులకు కూడా కఠిన శిక్షలు పడేలా చూడాలని కోరారు. ఆ మేరకు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలన్నారు. స్కామ్‌కు పాల్పడిన వారితో పాటు, వారికి సహకరించిన వారందరిపైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ తరహా సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

24, 25 తేదీల్లో డిపోల ఎదుట నిరసనలు

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి డిపోలను కాపాడుకోవడంతోపాటు విద్యుత్ బస్సుల పేరుతో ఆర్‌టిసి ప్రైవేటీకరణ చర్యలను నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 24, 25 తేదీల్లో ఆర్‌టిసి డిపోల ఎదుట నిరసన ధర్నాలకు పిలుపునిస్తున్నట్లు పేర్కొంది. విజయవాడ పాత బస్టాండు గవర్నర్‌పేట-2 డిపోను బహుళజాతి సంస్థ లూలూకు ఇవ్వాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ఫ్లిక్స్, నిగో పేర్లతో ఆర్‌టిసి రూట్లలో అక్రమంగా తిరుగుతున్న బహుళజాతి సంస్థల ప్రైవేట్ విద్యుత్ బస్సులను ఆపాలని డిమాండ్ చేసింది.

ఆర్‌టిసి స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

2

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- శాస్త్ర సాంకేతిక రంగంలో 2047 నాటికి దేశం అగ్రస్థానం
- ట్రిపుల్ ఐటి డిఎం స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ నారాయణన్
- విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేత

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ అన్నారు. కర్నూలులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైనింగ్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటి డిఎం) 7వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణన్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగంలో మార్పుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆలోచన చేయాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి పుట్టిన గడ్డకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని కోరారు. ఇలాంటి విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆలోచనలను పెంపొందించే విధంగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. మన దేశం ఇప్పుడు ఆహార ధాన్యాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందన్నారు. మన దేశం 2047 నాటికి శాస్త్ర, సాంకేతిక రంగంలో మరిన్ని మార్పులు సాధించి ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. స్వాతంత్య్రం అనంతరం శాస్త్ర, సాంకేతిక రంగంలో అనేక విజయాలను సాధించామని వివరించారు. భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు ఇప్పటికే దాదాపుగా 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపి సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకున్నామని తెలిపారు. వైద్య రంగంలో కూడా అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ విద్యా సంస్థ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ట్రిపుల్‌ఐటి డిఎం చైర్మన్ పద్మశ్రీ విజయలక్ష్మి దేశమనే మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులకు నూతన ఆవిష్కరణ పద్ధతుల్లో బోధన చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని వివరించారు. రాబోయే రోజుల్లో ఈ విద్యా సంస్థను పరిశోధనకు నిలయంగా మారుస్తామన్నారు. స్నాతకోత్సవ సభకు ట్రిపుల్ ఐటి డిఎం డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్.మూర్తి అధ్యక్ష వహించారు. స్నాతకోత్సంలో మొత్తం 206 డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ట్రిపుల్‌ఐటి డిఎం మాజీ డైరెక్టర్ డివిఎల్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తి, బోర్డ్ మెంబర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉదారవాద విధానాలతో అసమానతలు తీవ్రం

- డివైఎఫ్ఐ జాతీయ సదస్సులో ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

5

తిరోగామి శక్తులపై

సాహిత్యరంగంలోనే తీవ్ర పోరాటం

- సర్వ ప్రక్రియలు ప్రజా ఉద్యమం కోసమే
- 'తెలకపల్లి రవి రచనలు' ఆవిష్కరణ సభలో వక్తలు

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కె.రామచంద్రమూర్తి, బి.తులసీదాస్,ఎంవిఎస్ శర్మ, కె.ఆనందాచారి, గోళ్ల నారాయణరావు, కెంగార మోహన్, సత్యాజీ, రచయిత తెలకపల్లి రవి తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అభివృద్ధి నిరోధక, తిరోగామి శక్తులపై సాహిత్య రంగంలోనే తీవ్ర పోరాటం జరుగుతోందని 'తెలకపల్లి రవి రచనలు' ఆవిష్కరణ సభలో పాల్గొన్న పలువురు వక్తలు అన్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ప్రజాశక్తి బుక్ హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసంగించిన పలువురు ఆ మేరకు లెనిన్ చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం మన దేశంలో అదే పరిస్థితి కనపడుతోందని అన్నారు. దానిలో భాగంగానే తెలకపల్లి రవి సైతం తనకు ప్రావీణ్యమున్న సర్వప్రక్రియలను ప్రజా ఉద్యమాల కోసమే వినియోగించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి రాసిన ఆశయపథం, అభ్ర, సజీవం, ప్రజాగానం, మీదే ప్రేరణ మీదే సాధనలతోపాటు 'నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం - ఆరుద్ర' సంకలనాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి 'ఆశయ పథం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సాధారణంగా పత్రికా సంపాదకులు ఏదో ఒక అంశంలో నైపుణ్యం కలిగి ఉంటారని, తెలకపల్లి అనేక అంశాల్లో ప్రావీణ్యం సంపాదించారని చెప్పారు. సంపాదకుడిగా, కవిగా, రచయితగా, విమర్శకుడిగా, రాజకీయ విశ్లేషకుడిగా అన్ని అంశాల్లో నైపుణ్యం సాధించిన రవి ఆ నైపుణ్యాలన్నింటినీ ప్రజా ఉద్యమాలకే వినియోగించారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిజం, ఉద్యమాల గురించి ఎంతో మంది రాశారని, రవి రాస్తే అందులో ఎంతో ప్రత్యేకత ఉంటుందని అన్నారు. 'ప్రజాగానం' పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. ప్రజాగానంలో పాటలు అందరికీ సుపరిచితమైనవని, వివిధ కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఈ పాటలు వినిపిస్తుంటాయని అన్నారు. సాహితీ, రచన, వ్యాసం, ఉపన్యాసం రాజకీయం, అన్ని ప్రక్రియల్లో ప్రత్యేక నైపుణ్యం తెలకపల్లి రవికి ఉందని చెప్పారు. 'అభ్ర' పుస్తకాన్ని ఆవిష్కరించిన నవ తెలంగాణ సంపాదకులు కె.ఆనందాచారి మాట్లాడుతూ, నిత్య చైతన్య, చలన శీలి తెలకపల్లి రవి అని పేర్కొన్నారు. అభ్రలో కథలు చైతన్యంగా ఉంటాయన్నారు. ఒక మహిళ అంతరంగాన్ని అద్భుతంగా విశ్లేషించారని తెలిపారు. సాక్షి, భవనం, మంచి మామిడి, ఆకలి ఏడ్చింది, కరువు కథల దృశ్య చిత్రీకరణలు ఆయన ప్రస్తావించారు. 'మీదే ప్రేరణ - మీదే సాధన' పుస్తకాన్ని ఆవిష్కరించిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. సమాజం వల్ల వ్యక్తులు మారతారా లేక వ్యక్తుల వల్ల సమాజం మారుతుందా అంటే సందర్భాన్ని బట్టి జరుగుతుందన్న అంశాన్ని ఈ పుస్తకంలో వివరించారని చెప్పారు. 'సజీవం' పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీ ప్రవంతి అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ, సమకాలీన సమస్యలను ప్రస్తావించేలా ఈ కవిత్వం ఉంటుందన్నారు. మనిషి మనస్తత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించారన్నారు. 'నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం' - ఆరుద్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని చదివితే ఆరుద్రకు తెలకపల్లి రవి చాలా దగ్గరగా ఉన్నట్లు అర్థమవుతుందన్నారు. ప్రజాశక్తి, కమ్యూనిస్టు పార్టీ చరిత్ర చదువుతున్నట్లుగా అనిపిస్తోందని తెలిపారు. పుస్తకంలో ఆరుద్ర సతీమణి రామలక్ష్మి ఇంటర్వ్యూను ప్రచురించినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. దీర్ఘకాలం ఉద్యమంలో కలిసి నడిచిన తెలకపల్లి రవి ఉద్యమానికి ఎప్పుడు ఏది అవసరమో గుర్తించి ఆ రచనలు చేసి అందించేవారని చెప్పారు. సాహిత్యలోకం ఈ పుస్తకాలు చదివి స్పందించాలని ఉద్దేశంతో ఒకే సారి 6 పుస్తకాలను ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా 60 పుస్తకాలు రావాల్సినవి ఉన్నాయని చెప్పారు. అనంతరం ఈ పుస్తకాల రచయిత, సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ, సాహితీ రంగంలో ప్రస్తుతం జరుగుతున్న అధ్యయనం, పోరాటాన్ని మరింత తీవ్రం చేయాల్సి ఉందన్నారు. గత సినిమాల్లో దైవాన్ని మానవీకరించడం చూశామని, ప్రస్తుతం మానవుడి గాథల్ని దైవీకరిస్తున్నారని, ఇది సరిగా పూరణాల్ని పేర్కొన్నారు. ఈ పుస్తకాలు, ఇంకా రాబోయే అనేక రచనలు, కవిత్వాలు, పాటలు అన్నీ కూడా ఒక పునర్వికాసానికి, పునఃప్రస్థానానికి దారితీస్తే సంతోషిస్తానని చెప్పారు. దానికోసం ఒక క్రమపద్ధతిలో ఈ పుస్తకాలను తీర్చిదిద్ది తీసుకువస్తానని చెప్పారు. సజీవం 2 కవితా సంపుటిని త్వరలోనే తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజాగానం పుస్తకంలో పలు పాటలను ప్రజానాట్యమండలి సీనియర్ గాయకులు జగన్ ఆలపించారు. ఈ పాటలను విప్లవగాన ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ప్రజా గానం కాదు రవి కిరణాలుగా ఉన్నాయని పేర్కొన్నారు.

రాజధాని భూ కేటాయింపులపై రైతుల్లో భిన్నస్వరాలు

- కమర్షియల్ ప్లాట్ల ఉద్దేశానికి నష్టం జరుగుతుందన్న వాదన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో వాణిజ్య సంస్థలకు భూ కేటాయింపులపై రైతుల్లో భిన్నస్వరాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దపెద్ద కమర్షియల్ సెంటర్లకు, హోటళ్లకు రాజధాని పరిధిలో ప్రభుత్వమే భూములు కేటాయించడంపై అభ్యంతరాలు లేకపోయినా అన్నిటికీ ప్రభుత్వ భూములిస్తే తమ వాటాగా వచ్చిన ప్లాట్లను ఎవరు కొంటారని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని సంస్థలకు భూములు కేటాయించడం ద్వారా ఆయా సంస్థలు వచ్చి ఇక్కడ నిర్మాణాలు చేపడితే భూముల ధరలు పెరగడంతోపాటు యాక్టివిటీ పెరుగుతుందన్నది వీరి అంచనా. దానికి తగ్గట్టే ప్రభుత్వం కొన్ని హోటళ్లకు కన్వెన్షన్ సెంటర్లకు భూములు కేటాయించింది. వాటి నిర్మాణాలు వెంటనే చేపట్టాలని ఆదేశించింది. అయితే వరుసగా అన్ని సంస్థలకు ప్రభుత్వమే భూములు కేటాయిస్తుండటం వీరిలో చర్చనీయాంశంగా మారింది. దీనికి బదులు రైతుల వాటాగా వచ్చిన భూమిని నేరుగా రైతులే అమ్ముకునేలా లేదా ఆయా సంస్థలతో అభివృద్ధి ఒప్పందం ఇచ్చేలా ఆలోచన చేస్తే బాగుంటుందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో 4000 గజాల నుండి 25000 గజాలలోపు ప్లాట్లు 920 వరకూ ఉన్నాయి. పెద్దపెద్ద వ్యాపారులందరికీ ప్రభుత్వం నేరుగా తక్కువ ధరకు భూమి కేటాయిస్తే భవిష్యత్‌లో తమ భూములు కొనుగోలు చేసే వారిని వెతుక్కోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. కొన్ని సంస్థలకు ప్రభుత్వం కేటాయించినా కొన్నిటికైనా రైతులే నేరుగా అమ్ముకునేలా లేదా అభివృద్ధి ఒప్పందాలు చేసుకునేలా ప్రభుత్వమే చూడాలని కోరుతున్నారు. గతంలో రాజధానిలో ఎస్‌ఆర్‌ఎం, విట్ వంటి వాటితోపాటు మరికొన్ని సంస్థలకు పెద్దఎత్తున భూములు కేటాయించారు. అప్పట్లో రాజధానిలో భూములు పొందిన సంస్థలు బ్యాంకుల్లో భూములు తాకట్టు పెట్టి వాటిద్వారా ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించారనే విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం ఒప్పందాలు చేసుకునే సమయంలో అమరావతికి వచ్చే సంస్థలతో రైతులతో సమావేశం నిర్వహించి వారికి వచ్చిన వాటా భూముల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యేలా చూడాలని వారు కోరుకుంటున్నారు. వేర్వేరు సంస్థలకు భూ కేటాయింపులను స్వాగతిస్తున్నామని, తమకు వచ్చిన భూముల విషయంలో ప్రభుత్వమూ ముందుచూపుతో ఆలోచించాలని వారు కోరుతున్నారు.

'స్నేహ మ్యాక్స్' ఛైర్మన్ శివభాగ్యారావు కోసం గాలింపు

- విశాఖలో రూ.100 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన కో - ఆపరేటివ్ సొసైటీపై కేసు

ప్రజాశక్తి - ఉక్కునగరం, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

స్నేహ మ్యాక్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ రూ.100 కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేయడంపై సంస్థ ముమ్మరంగా దర్యాప్తు సాగుతోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి సంస్థ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావుతో పాటు డైరెక్టర్లు గూడూరు సీతామహాలక్ష్మి, ఉండపల్లి శ్రీనివాసరావు, ఎల్.విశ్వేశ్వరరావు, మేనేజర్ రంగారావు, అకౌంటెంట్ ధనలక్ష్మిలను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంస్థ ఛైర్మన్ శివభాగ్యారావు పరారీలో ఉండడంతో ఆయన కోసం, అలాగే ఈ కేసుతో సంబంధం ఉన్న మరో 12 మంది కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. విశ్రాంత ఎంఎస్ అధికారి కటికల శివభాగ్యారావు 2008లో స్నేహ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ (స్నేహ మ్యాక్స్)ని విశాఖపట్నంలో స్థాపించారు. 12 శాతం వడ్డీ ఇస్తామని చెప్పి ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను, ఇతరులను నమ్మించి సుమారు 2500 మంది నుంచి రూ.100 కోట్లు సేకరించారు. కొన్నాళ్లపాటు సక్రమంగా వడ్డీ చెల్లించి ఆ తర్వాత క్రమంగా కార్యకలాపాలు తగ్గించుకుంటూ రావడంతో డబ్బులు కట్టినవారికి అనుమానం వచ్చింది. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఖాతాదారులు డిమాండ్ చేసినా ఫలితం లేకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు విషయంలో పోలీసులు తీవ్ర గోప్యత పాటిస్తున్నారు.

టీచర్ అనుమానాస్పద మృతి

- భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరులో ఉపాధ్యాయురాలు ఉరేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా... ఆమె భర్త బ్లేడుతో కాళ్లు, చేతులను కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చొదిమెళ్లలో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదపాడు మండలం నాయుడుగూడెం గ్రామానికి చెందిన చిన్ని సురేంద్రకు, నూజివీడుకు చెందిన దేవిక (40)తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు ఇద్దరూ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. సురేంద్ర, దేవిక ఏలూరు రూరల్ పరిధిలోని చొదిమెళ్ల ప్రాంతంలో శ్రీవల్లి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. దంపతులిద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ప్రతిరోజు లాగానే శనివారం కూడా భార్యాభర్తలు పాఠశాలకు వెళ్లారు. పాఠశాల ముగిసిన అనంతరం దేవిక సాయంత్రం త్వరగా ఇంటికి చేరుకున్నారు. సురేంద్ర ఆలస్యంగా ఇంటికి వచ్చారు. దేవిక తలుపులు తీయకపోవడంతో సురేంద్ర తన వద్ద ఉన్న రెండో తాళం చెవితో తలుపులు తీసుకొని లోపలికి వెళ్లి చూడగా దేవిక చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. దీంతో అయోమయానికి గురైన సురేంద్ర ఇంట్లో ఉన్న బ్లేడుతో చేతులు, కాళ్లపై నరాలను కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదే సమయంలో నాయుడుగూడెంలో ఉండే సురేంద్ర సోదరుడు పలుమార్లు భార్యాభర్తలకు ఫోన్ చేసినా ఇద్దరూ తీయకపోవడంతో వెంటనే అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్నారు. అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి చూడగా దేవిక ఉరివేసుకొని మృతి చెందగా.. సురేంద్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దేవిక మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. సురేంద్ర ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్‌లో తన వైఖరి స్పష్టంగా తెలపాలని డిమాండ్ చేశారు. అలాగే భారత్ గౌరవాన్ని, సైన్యం ధైర్యాన్ని ప్రశ్నించే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాల్సిందేనన్నారు. దీంతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. వీటిపైనా ప్రధాని సమాధానం ఇవ్వాలన్నారు. అలాగే, రక్షణ, విదేశాంగ విధానంపై మోడీ సభలో ప్రసంగించాలన్నారు. రెండున్నరేళ్లు గడిచినా మణిపూర్‌లో అశాంతి కొనసాగుతుందని, మోడీ ఇప్పటికీ అక్కడ సందర్శించి భరోసా కల్పించడం లేదని విమర్శించారు. ఆప్ ఎంపి సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. వాణిజ్య ఒప్పందం పేరుతో కాల్పుల విరమణ ప్రకటించేలా చేశానని ట్రంప్ చెబుతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. జెఎంఎం ఎంపి మహువా మాంఝీ మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి లేవనెత్తినట్లు తెలిపారు. ఒడిశాలో మహిళలపై జరుగుతున్న దారుణాలపై బిజెడి ఎంపి సస్మిత్ పాత్ర లేవనెత్తారు.

అన్ని అంశాలూ చర్చించేందుకు సిద్ధం : కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. అఖిలపక్ష సమావేశం నిర్మాణాత్మకంగా జరిగిందన్నారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశంపై మీడియా ఆయనను ప్రశ్నించగా.. ఆపరేషన్ సిందూర్ వంటి ముఖ్యమైన అంశాలపై పార్లమెంటులో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు సంబంధించి ఆయన స్పందిస్తూ.. ఈ దిశగా ఇప్పటికే వంద మంది ఎంపిలు సంతకాలు చేశారన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై డొనాల్డ్ ట్రంప్ ప్రకటనకు సంబంధించి సభలో చర్చిస్తామని వెల్లడించారు. ఈ సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోడీ సైతం పాల్గొంటారని చెప్పారు. ఇక ఈ వర్షకాల సమావేశాల్లో ఆమోదం కోసం 17 బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎల్ మురుగన్, అనుప్రియ పటేల్ (అప్నాదల్), రాందాస్ అథ్వాలే (ఆర్‌పిఐ), జైరాం రమేష్, కె సురేష్ (కాంగ్రెస్), సుప్రియా సులే (ఎన్‌సిపి), తిరుచ్చి శివ, టిఆర్ బాలు (డిఎంకె), రామ్‌గోపాల్ యాదవ్ (ఎస్‌పి), సంజయ్ సింగ్ (ఆప్), జాన్ బ్రిట్టాస్ (సిపిఎం), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టిడిపి), పిల్లి సుభాష్ చంద్రబోస్, మద్దిల గురుమూర్తి, తనుజా రాణి (వైసిపి), బాలశౌరి (జనసేన), కెఆర్ సురేష్ రెడ్డి (బిఆర్ఎస్), సస్మిత్ పాత్ర (బిజెడి), ఎన్‌కె ప్రేమచంద్రన్ (ఆర్ఎస్‌పి), మహువా మాఝీ (జెఎంఎం) తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ కేంద్రాల ద్వారా పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ ఎస్‌సి, ఎస్‌టి యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా బ్యాంకు పిఒ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్-ఎస్‌సి), రైల్వే రిక్రూట్‌మెంట్ (ఆర్ఆర్‌బి) పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. ఈ సదవకాశాన్ని ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

జిఓలు 20, 5ను అమలు చేయాలి

- రేషన్ డీలర్ల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధికారంలో ఉన్న 2014-19 మధ్య కాలంలో డీలర్లకు క్వింటాకు రూ.200 కమిషన్, సహాయకులకు రూ.5 వేల జీతం ఇవ్వాలని ఇచ్చిన జిఓ నెంబరు 20, జిఓ నెంబరు 5ను అమలు చేయాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విజయవాడ బందరు రోడ్డులోని ఎంబివికెలో ఆదివారం రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా దివి లీలా మాధవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అడపా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా కొప్పాక శేషు, కోశాధికారిగా తిరుపాలయ్య, డీలర్స్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా బోడేపూడి ఫణికుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంసిహెచ్ కాశింను ఎన్నుకున్నారు. రాష్ట్ర మహిళా విభాగం గౌరవాధ్యక్షులుగా అన్నపూర్ణ, అధ్యక్షులుగా జ్యోష్ణకుమారి, ప్రధాన కార్యదర్శిగా హేమలత, కోశాధికారిగా మల్లేశ్వరిని ఎన్నుకున్నారు.

కదులుతున్న డొంక

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణం కేవలం నెల్లూరులోనూ కాకుండా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు కూడా విస్తరించే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, వీరు తరచూ ఈ ప్రాంతాలకు వెళ్లి వస్తుండటమే దీనికి కారణం. దీంతోపాటు తాము ఏర్పాటు చేసిన ఫేక్ కంపెనీల కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది పేర్లమీద కూడా అక్రమంగా రుణాలు పొందినట్లు తెలిసింది. జాలే వాసుదేవనాయుడు తన కార్యాలయంలో పనిచేసే తనుజా పేరుతో చెన్నై యాక్సెస్ బ్యాంక్‌లో రూ.35 లక్షలు, నెల్లూరులో రూ.10 లక్షలు, విశాఖపట్నంలో రూ.23 లక్షలు రుణం తీసుకున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు నగరం వనంతోపుకు చెందిన కోటయ్య (ఆఫీసు సెక్యూరిటీ గార్డు) భార్య పేరుతో రూ.50 లక్షలు, నవాబుపేటకు చెందిన స్వప్నిక తన ఆఫీసులో పనిచేస్తుండగా ఆమె పెద్దమ్మ పేరుతో రూ.12 లక్షలు, ఎస్‌కె కరీముల్లా (యు ట్యూబ్ ఛానల్ కెమెరామెన్) రూ.10 లక్షలు, ఇలా అనేక మంది బాధితులు వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తే పెద్ద మొత్తంలో స్కామ్ బయటపడుతుందని వీరు అంటున్నారు. బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడిన గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కెసి పెంచలయ్య న్యాయం చేయకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఆర్‌టిసి స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- విజయవాడ పాత బస్టాండ్‌ను లూలూ కంపెనీకి అప్పగించొద్దని ధర్నా

విజయవాడ పాత బస్టాండ్ వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ

ఆర్‌టిసి స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమం నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తెలిపారు. విజయవాడ పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి కట్టబెట్టకుండా ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. రూ.400 కోట్ల విలువైన నగరంలోని పాతబస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి ఇవ్వొద్దని, ప్రజాప్రయోజనాలకే వినియోగించాలని కోరుతూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యాన పాతబస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్పొరేట్ కంపెనీలకు విలువైన ఆర్‌టిసి స్థలాలను కట్టబెట్టొద్దని, ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని నినాదాలు చేశారు. సిపిఎం విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో బాబూరావు మాట్లాడుతూ ఆర్‌టిసి ప్రయివేటీకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిలో భాగంగానే ఆ సంస్థ స్థలాలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని అన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు వందల కోట్ల విలువైన ఆర్‌టిసి స్థలాలను కట్టబెట్టడాన్ని అడ్డుకుంటామని తెలిపారు. వీటిని కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. విజయవాడ పాతబస్టాండ్, విద్యాధరపురం ఆర్‌టిసి స్థలాలను లూలూ కంపెనీకి ధారాదత్తం చేసే ప్రయత్నాలను టిడిపి కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని, విజయవాడ ఎంపి, ఎమ్మెల్యేలు స్పందించి ఆర్‌టిసి స్థలాలను కాపాడాలని కోరారు. ఆర్‌టిసి, ఇతర ప్రభుత్వ భూములను బడా కంపెనీలకు అప్పగిస్తున్నా ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోతే ప్రజలు క్షమించబోరని తెలిపారు. విజయవాడలో ఓ వైపు మెట్రో రైలు నిర్మిస్తామని, ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పి ప్రైవేటు భూములను తీసుకుంటున్న ప్రభుత్వం... మరోవైపు వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అత్యంత కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ విజయవాడ బృందావన్ కాలనీలో విజయవాడ నగర పాలక సంస్థకు చెందిన రూ.30 కోట్ల విలువైన 1098 గజాల స్థలాన్ని రాఘవేంద్ర మఠానికి ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి 2018లో ఇచ్చిన 707 జిఒను ప్రభుత్వం తిరగదోడుతోందన్నారు. ఇటువంటి భూపందారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు ఆర్‌టిసి ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ధర్నాలో సిపిఎం పశ్చిమ, తూర్పు సిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, పి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

కొనసాగిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

జిఒ నంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా కల్పించాలి, సంక్షేమ పథకాలు అమలు చేయాలి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఆదివారమూ కొనసాగింది. సమస్యలు పరిష్కరించాలని అనేక రూపాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించకపోవడంతో తప్పని పరిస్థితిలో సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని కార్మికులు తెలిపారు. గత సమ్మె కాలపు 17 రోజుల ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. నెల్లూరులోని స్వతంత్ర పార్కు నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేయి చేయి పట్టుకొని గాంధీ బొమ్మ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్, ఆమదాలవలసలో నిరసన ప్రదర్శన చేశారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్ద దీక్ష చేపట్టారు. ఇచ్చాపురం మస్టర్ కార్యాలయం వద్ద మౌనప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగింది. అనంతపురం, పుట్టపర్తి, హిందూపురంలో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు సత్యసాయి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కార్మికులు సమ్మె చేశారు. విజయవాడలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మికులు నినాదాలు చేశారు.

మిథున్‌రెడ్డికి 1 వరకు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు ధైర్యం ఉంటే తన హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై కేంద్ర దర్యాప్తు కోరాలన్నారు.

భూ కుంభకోణాలపైనా చర్యలు : మంత్రి అనగాని

లిక్కర్ స్కామ్‌తోపాటు భూ కుంభకోణాలు, ఇతర అవినీతి వ్యవహారాల్లో భాగమైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. కల్తీమద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి, డిజిటల్ పేమెంట్లు లేకుండా రూ.వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిన వారిని సిట్ అధికారులు విచారణ జరిపి అరెస్టులు చేస్తున్నారని తెలిపారు.

అరెస్టును స్వాగతిస్తున్నాం : పివిఎన్ మాధవ్

ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టును స్వాగతిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ వెల్లడించారు. డిజిటల్ పేమెంట్ లేకుండా లిక్కర్ సొమ్మును దోచేశారన్నారు. రాష్ట్ర పోలీసులు దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం ఎఇ విజయకుమార్ నీటిని విడుదల చేశారు. వారం రోజుల క్రితం ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు 1.7 టిఎంసిల నీటిని డ్యామ్ అధికారులు వదిలారు. ఈ నీటిని నల్లగొండ జిల్లా పరిధిలో తాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తున్నామని అధికారులు చెప్పినా.. పాలేరు రిజర్వాయర్ పరిధిలోని రైతాంగం నారుమడులు పోసుకోవడానికి వినియోగించుకున్నారు. దాంతో ఆదివారం ఉదయం 9.30 గంటలకు 1000 క్యూసెక్కులను డ్యామ్ అధికారులు విడుదల చేశారు. క్రమేణా వాటిని 2000 క్యూసెక్కుల వరకు పెంచి విడుదల చేయనున్నారు. ఆగస్టు ఒకటో తేదీన పూర్తిస్థాయిలో ఎడమ కాలువకు సాగునీటి అవసరాల నిమిత్తం మంత్రులు నీటిని విడుదల చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. సోలార్ ప్రాజెక్టుల పేరుతో పెద్ద పెద్ద గద్దలు భూములపై వాలుతున్నాయన్నారు. ప్రభుత్వం చెప్పిన ధరకు భూములు లీజుకు ఇస్తే 30 ఏళ్లలో రైతుకు ఎకరాకు రూ.13 లక్షలు మాత్రమే చెల్లిస్తారని, కంపెనీకి రూ.12 కోట్లు ఆదాయం వస్తుందని తెలిపారు. నిలబడి పోరాడిన చోట రైతులు విజయాలు సాధిస్తున్నారని, ఆ స్ఫూర్తితో పోరాడాలని అన్నారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణకు ముందు నోటీసు ప్రచురించి గ్రామసభ నిర్వహించి ఆమోదం తీసుకుని, సామాజిక ప్రభావాన్ని అంచనా వేయాలని, ఇవి ఎక్కడా జరగడం లేదని, ఈ చట్టాన్ని పాలకులు నీరుగారుస్తున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు వివరించారు. భూమికి పరిహారంతోపాటు పునరావాస పరిహారం కూడా చెల్లించాలన్నారు. రైతుల పోరాటంతో కర్ణాటకలో ఏరోస్పేస్‌కు ఇచ్చిన భూకేటాయింపు రద్దు చేశారని, ఆ సంస్థకు ఇక్కడ లోకేష్ భూమి ఇస్తామనడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 2047 నాటికి 50 ఎకరాలలోపు ఉన్న రైతు ఒక్కరు కూడా ఉండడానికి వీల్లేదని విజన్ 2047లో పేర్కొన్నారని, భూ సేకరణ చట్టం రద్దు చేయాలని మోడీ చూస్తున్నారని, అందులో ఎపి మొదట ఉందని తెలిపారు. కార్పొరేట్లకు భూములు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలే దళారీ పాత్ర పోషిస్తున్నాయని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు విమర్శించారు. అభివృద్ధిని ఎవరూ కాదనరని, రెండు, మూడు పంటలు పండే భూములను కాకుండా బీడు భూములను తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వాలు మధ్యవర్తిగా ఉండి రైతుల మెడపై కత్తి పెడుతున్నాయని విమర్శించారు. భూములు తీసుకున్న కంపెనీలు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాయో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. పంటలు పండే భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాలన్నారు. సదస్సులో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులు ఎ.రాజశేఖర్, వెంకయ్య, వెంకటరావు, జి.రామకృష్ణ, చంద్రశేఖరరెడ్డి, అన్ని జిల్లాల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముద్రగడకు అస్వస్థత

- ఫోన్‌లో మాజీ సిఎం జగన్ పరామర్శ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, సామర్లకోట

మాజీ మంత్రి, వైసిపి నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం రాత్రి శ్వాస సంబంధిత సమస్యతో అస్వస్థతకు గురికావడంతో కాకినాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చి, చికిత్స అందిస్తున్నారు. ముద్రగడ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆయన కుమారుడు ముద్రగడ గిరిబాబుకు మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేసి పరామర్శించారు. ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గిరిబాబు మాట్లాడుతూ తన తండ్రి ఆరోగ్యం పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. పార్టీలకతీతంగా తన తండ్రిని పరామర్శించడా నికి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ముద్రగడకు ఎమ్మెల్యే చినరాజప్ప పరామర్శ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం పరామర్శించారు. ముద్రగడ తనయుడు ముద్రగడ గిరిబాబును కలిసి పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు భూములిచ్చేది లేదు

- జానకయ్యపేటలో భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

భూసేకరణను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న రైతులు

తమ ప్రాంతంలో ఏర్పాటు చేయదలిచిన బల్క్‌డ్రగ్ పార్క్‌కు భూములిచ్చేది లేదని అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని జానకయ్యపేట రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఈ మేరకు తీర్మానం చేశారు. బల్క్‌డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కోసం అదనంగా చేపడుతున్న భూసేకరణను వ్యతిరేకిస్తూ గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో రైతులు ఆదివారం సమావేశమయ్యారు. అనంతరం నిరసన తెలిపారు. భూసేకరణ కోసం గ్రామంలో అధికారులు గ్రామసభ నిర్వహించినప్పుడు తామంతా భూములివ్వబోమని ముక్తకంఠంతో చెప్పినప్పటికీ తమ మనోభావాలను అర్థం చేసుకోకుండా భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భూముల విషయమై ప్రభుత్వం ముందుకెళ్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతులకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి నాయకులు శీరం నరసింహామూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానకయ్యపేట గ్రామంలో చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం చేసుకుంటూ.. గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో భూములన్నీ సారవంతమైనవని తెలిపారు. కొబ్బరి, జీడి తోటలతో పచ్చగా కళకళలాడుతూ మినీ కోనసీమగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో విషతుల్య పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. విదేశాల్లో వ్యతిరేకించిన బల్క్‌డ్రగ్ పార్కును ఈ ప్రాంతంలో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. జానకయ్యపేటలో 190 ఎకరాల భూమిని బల్క్‌డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు రెండో ఫేజ్‌లో భూసేకరణ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారని, భూములివ్వడానికి రైతులు సిద్ధంగా లేరని తెలిపారు. వారి మనోభావాలను, జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో భూగర్భ జలాల క్షీణత

- కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జల వనరులు క్షీణించడం, కాలుష్యానికి గురవడం జరుగుతోందని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం చర్యలు తీసుకోకుంటే ఎన్నో ప్రాంతాలలో నీటి కొరత ఏర్పడి సమస్య క్లిష్టంగా మారుతుందని తెలిపారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు లేఖ రాశారు. ఈ మేరకు వివరాలను ఆదివారం శర్మ మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర జలవనరుల శాఖ https://apwrims.ap.gov.inలో ప్రచురించిన లేఖల ప్రకారం.. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భూగర్భ జలవనరులలో ఏటా క్షీణత కనిపిస్తోందన్నారు. రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందని తెలిపారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు భూగర్భ జలాల వాటర్ టేబుల్‌ను పోల్చి చూస్తే ఈ పరిస్థితి ఇట్టే అర్థమవుతుందన్నారు. గతంతో పోల్చితే రాయలసీమలో 4.25 ఎంబిజిఎల్, కోస్తాంధ్రలో 3.74, ప్రకాశంలో 8.24, శ్రీసత్యసాయి జిల్లాలో 7.24 ఎంబిజిఎల్ క్షీణత కనిపించినట్టు తెలిపారు. మున్సిపాలిటీలలో నీటికొరత తీవ్రం కానుందన్నారు. విశాఖపట్నం వంటి నగరాలలో బహుళ అంతస్తుల భవనాలు విస్తృతంగా రావడం వల్ల భూగర్భ జలవనరుల మీద ఒత్తిడి పెరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా నగర ప్రాంతాల్లో భూగర్భ జల వనరులకు ఏటా ఎంతో నష్టం జరుగుతున్నా ప్రభుత్వ సంస్థలు ఎటువంటి నిబంధనలూ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పోలవరంవంటి పెద్ద ప్రాజెక్టుల ద్వారా లక్షలాది మంది కుటుంబాలను నిర్వాసితులు చేసి, వందలాది మైళ్ల నుంచి నీటిని నగరాలలో ప్రజలకు సరఫరా చేసే బదులు ప్రకృతి ఏటా ఇచ్చే భూగర్భ జల వనరులను పరిరక్షించే దిశలో ప్రభుత్వం మార్పులు ప్రవేశపెట్టడం ఎంతో అవసరమని తెలిపారు.

అభివృద్ధి పేరుతో పంట పొలాలను లాక్కోవద్దు

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాలను అభివృద్ధి పేరుతో లాక్కుంటూ పచ్చని పంట పొలాలను ధ్వంసం చేయాలనే నిర్ణయాన్ని పునఃపరిశీలన చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో కరేడు భూముల నేపథ్యంలో 'అభివద్ధి పేరుతో భూదోపిడి' అనే అంశంపై ఆదివారం జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్త వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 5500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్రీసిటీలో 300 లకుపైగా కంపెనీలు కొనసాగుతుంటే నేడు 8500 ఎకరాల పచ్చని పంట పొలాలను ఇండోసోల్ అనే ఒక్క కంపెనీకి ధారాదత్తం చెయ్యాలనే కుటిల ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వేలమంది కరేడు రైతులు ఏకతాటిపై నిలబడి తమ భూములను రక్షించుకోవడానికి చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా 140 మీటర్ల వెడల్పుతో 189 కిలోమీటర్ల పొడవైన ఎనిమిది లైన్ల అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మించాలనుకోవడం, ఇందుకోసం 8500 ఎకరాల భూమిని సేకరించడం దుర్మార్గమన్నారు. అమరావతి రెండో దశలో 44 వేల ఎకరాలు తీసుకొని అందులో 1500 ఎకరాలతో రైల్వే స్టేషన్, 2500 ఎకరాలతో స్పోర్ట్స్ సిటీలతోపాటు ఐదు వేల ఎకరాలతో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని భావించడం అవివేకమన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్‌కౌన్సిల్ సభ్యులు, ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఇండోసోల్ కంపెనీకి రూ.46,429 కోట్ల విలువైన ప్రజాధనాన్ని ప్రోత్సాహకాలు, సబ్సిడీల రూపంలో ఇవ్వాలనుకోవడం ప్రజా వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. తిరుపతి నగర విస్తీర్ణం 6700 ఎకరాలు, విజయవాడ నగర విస్తీర్ణం 15 వేల ఎకరాలు ఉండగా ఒక్క ఇండోసోల్ కంపెనీకి దాదాపు పదివేల ఎకరాలు కేటాయించాలనుకోవడం భావ్యం కాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో గత మూడు దశాబ్దాలుగా లక్షల ఎకరాలు పెట్టుబడిదారులకు, వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేశారని, వాటిలో 75 శాతం భూమిలో ఎలాంటి సంపద సృష్టించకుండా, ఉద్యోగావకాశాలు కల్పించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దారి తీసిందన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రూ.500 కోట్ల విలువైన ఐదు ఎకరాల విస్తీర్ణంలో విజయవాడలోని ఆర్‌టిసి స్థలాన్ని లూలు మాల్‌కు కట్టబెట్టాలని నిర్ణయించడం సహేతుకం కాదన్నారు. ఈ మాల్ వల్ల పరిసర ప్రాంతాలలో ఉన్న ఎన్నో కిరాణా షాపులు మూతపడి, ఎందరో ఉపాధి కోల్పోతారని తెలిపారు. ఐలు రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక ప్రభావ అభిప్రాయ సేకరణ అవసరం లేదంటూ కరేడు భూసేకరణపై గెజిట్ విడుదల చేయడాన్ని తప్పుపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, సామాజిక విశ్లేషకులు టి ధనుంజయ రెడ్డి, కరేడు పోరాట కమిటీ నేతలు ఎన్ సుకన్య, పి రామలక్ష్మమ్మ, ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, కొరివి వినయ్ కుమార్, ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ తదితరులు ప్రసంగించారు.

కిషోర్‌తో పోలీసులు, బంధువులు

సూసైడ్ లెటర్ రాసి అదృశ్యమైన ఎఇఇ ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - తిరువూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

రిలీవ్ ఆర్డర్ ఇవ్వలేదని ఆత్మహత్య చేసుకుంటునట్లు లెటర్ రాసి అదృశ్యమైన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులోని జల వనరుల శాఖ అసిస్టెంగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) ఏసుపోగు కిషోర్ ఆచూకీ లభ్యమైంది. ఫోన్ సిగ్నల్ ఆధారంగా మొదట తెలంగాణలో అక్కడ నుండి విశాఖపట్నం, చివరకు రాజమండ్రిలో ఆయన ఆచూకీని కనుగొన్నారు. కిషోర్ మామయ్య జామ ఆనందరావు, బంధువులతో కలిసి పోలీసులు పట్టుకున్నారు. తాను ఎన్ని ప్రయత్నాలు చేసినా రిలీవ్ చేయకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కిషోర్ లెటర్ రాసి అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి ఆయన అదశ్యమైన విషయం తెలిసిందే. సాధారణ బదిలీల్లో భాగంగా జగ్గయ్యపేటకు బదిలీ అనుమతి వచ్చిందని, అయితే తాను విధులు నిర్వహించిన తిరువూరు నుండి రిలీవ్ ఆర్డర్ ఇవ్వడంలేదని, ఇందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ, స్పెషల్ డివిజన్, విజయవాడ) పి గంగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఇఇ, స్పెషల్ సబ్ డివిజన్, కంచికచర్ల) ఎస్ ఉమాశంకర్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కారణమని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈ కేసును తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ విచారించారు.

అంబటికి పోలీసుల నోటీసులు

- అక్రమ కేసులతో వైసిపిని అణచలేరు : రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అంబటికి నోటీసులు ఇస్తున్న సత్తెనపల్లి పోలీసులు

మాజీ మంత్రి అంబటి రాంబాబుకు సోమవారం విచారణకు హాజరు కావాలని పోలీసులు ఆదివారం నోటీసులు అందజేశారు. మాజీ సిఎం వైఎస్ జగన్ గత నెల 18న సత్తెనపల్లి పర్యటనలో భాగంగా అంబటి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న అభియోగాలతో నమోదైన కేసుపై ఈ విచారణ జరగనుంది. పోలీసులు నోటీసుల నేపథ్యంలో అంబటి రాంబాబు ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను సోమవారం విచారణకు హాజరు కానున్నట్టు తెలిపారు. రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్టును ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్ అక్రమ కేసులతో వైసిపిని అణచాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తమను ఎవ్వరూ అణచలేరన్నారు. వైసిపి ప్రభుత్వం మద్యం విక్రయాలు నిర్వహిస్తే చంద్రబాబు తప్పుపట్టారని, గతేడాది కాలంగా రాష్ట్రంలో ఊరూర బెల్టుషాపులు, దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూంలు ఏర్పాటు అయ్యాయని, వాటికి ఏం సమాదానం చెబుతారని ప్రశ్నించారు. లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపి మద్యం విక్రయాల్లో ఏదో జరిగిపోయినట్టు చిత్రీకరించి పలువురిపై అక్రమ కేసులు నమోదు చేశాని విమర్శించారు. గంజాయి విక్రయాలను నిరోధిస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఏమాత్రం నిరోధించలేక చేతులు ఎత్తేసిందన్నారు.

అటవీ బీట్ ఆఫీసర్లుగా సిద్ధమేనా?

కెరీర్ గైడెన్స్

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

అడవుల సంరక్షణే ధ్యేయంగా పనిచేసేలా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బిఒ), అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ (ఎబిఒ) పోస్టుల భర్తీకోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) జులై 14న నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో ఎంపికైన వారికి ఒకవైపు అటవీ భూముల్ని ఆక్రమణల నుంచి కాపాడటంతోపాటుగా అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత ఉంటుంది. వన్యప్రాణుల్ని సంరక్షించటం కూడా విధుల్లో భాగమే. ఎఫ్‌బిఒ 256, ఎబిఒలో 435 వరకూ మొత్తం 691 పోస్టులను భర్తీ చేయబోతున్నారు. ప్రత్యేక అర్హతలున్న వారు, క్రీడాకారుల కోసం ప్రత్యేక కోటా ఉంటుంది. అభ్యర్థులు జులై 16 నుంచి ఆన్‌లైన్‌లో ఆగస్టు 5వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవటానికి గడువు వుందని ఎపిపిఎస్‌సి కార్యదర్శి పి.రాజబాబు (ఐఎఎస్) ప్రకటించారు. ఈ రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి. అలాగే శారీరక ప్రమాణాలు కూడా తప్పనిసరిగా ఉండాలి. ఈ పోస్టులకు స్త్రీ, పురుష అభ్యర్థులు ఎవరైనా పోటీ పడొచ్చు. పురుష అభ్యర్థులు కనీసం 163 సెం.మీ ఎత్తు, మహిళలు కనీసం 150 సెం.మీ ఎత్తు కలిగి ఉండాలి. నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. ఎన్‌సిసి సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు బోనస్ మార్కులు ఇస్తారు. అభ్యర్థుల వయోపరిమితి 2025 జులై 1 నాటికి తప్పనిసరిగా 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఐదేళ్లపాటు వయస్సులో సడలింపు ఉంటుంది. దరఖాస్తుకు ముందుగా అభ్యర్థులు తప్పనిసరిగా ఎపిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో ఒటిపిఆర్ రిజిస్ట్రేషన్ చేయాలి. దరఖాస్తు చేసేటప్పుడు అన్ని వివరాలు ఖచ్చితంగా పూర్తి చేయాలి.

అటవీశాఖలో ఉండే పోస్టులు
- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్
- అసిస్టెంట్ బీట్ ఆఫీసర్
- టెక్నికల్ అసిస్టెంట్
- జూనియర్ అటెండెంట్స్
- అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్
- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్
- జూనియర్ అసిస్టెంట్
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎఫ్‌సీఆర్ఐ)

తదితర పోస్టులు ఉంటాయి. ప్రస్తుతం ఎఫ్‌బిఒ, ఎబిఒ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ వచ్చింది.

దరఖాస్తు ఫీజులు :
- జనరల్ అభ్యర్థులు రూ.250-ఎగ్జామినేషన్ ఫీజు రూ.80 కలిపి మొత్తం రూ.330 చెల్లించాలి.
- ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఎక్స్ సర్వీస్‌మెన్, నిరుద్యోగ యువత తదితరులకు ప్రాసెసింగ్ ఫీజు రూ.250. వీరికి ఎగ్జామినేషన్ ఫీజు రూ.80 నుంచి మినహాయింపు వర్తిస్తుంది.
- స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ ఒఎంఆర్ బేస్డ్)
- మెయిన్స్ ఎగ్జామినేషన్, నడక, మెడికల్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్

జీత భత్యాలు
ఎఫ్‌బిఒ: రూ.25,220 నుంచి రూ.80,910 (7వ సిపిసి)
ఎబిఒ : రూ.23,120 నుంచి రూ.74,770
దరఖాస్తు చేసే విధానం :
psc.ap.gov.in లో OTPR ద్వారా ప్రొఫైల్ రిజిస్టర్ చేయాలి
ఆన్‌లైన్ ఫారాన్ని పూర్తిచేయాలి. డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాలి.
ఫీజు చెల్లింపులు : నెట్‌బ్యాంక్, డెబిట్, క్రెడిట్ కార్డ్ ద్వారా)
పరీక్షలు ఎలా జరుగుతాయంటే :
ప్రాథమికంగా, ఎఫ్‌బిఒ, ఎబిఒ పరీక్ష తేదీ: 7 సెప్టెంబర్ 2025 (ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకూ)
పరుగుటెస్ట్, ఆరోగ్య పరీక్షల అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు. ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు ఉంటాయి.
నిర్వహించబడతాయి
ఉద్యోగాల స్క్రీనింగ్, మెయిన్స్, సిబిటిలో పరీక్షలు ఉంటాయి.

1.ప్రిలిమ్స్ (స్క్రీనింగ్ టెస్ట్)
రెండువిభాగాలు : పార్ట్-ఎ, పార్ట్-బి
మొత్తం ప్రశ్నలు 150 (ప్రతి భాగం 75), మొత్తం మార్కులు 150, సమయం-150 నిమిషాలు
తప్పు జవాబు చేస్తే 1/3 మార్కు తగ్గుతుంది.
పార్ట్ ఎ- జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ
సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా పరిణామాలు
ఆంధ్రప్రదేశ్, భారతదేశంలో ప్రస్తుతం జరిగే పరిణామాలు
భారత చరిత్ర (సామాజిక, ఆర్థిక, రాజకీయ)
దేశంలోని భూముల సాంద్రత-ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టి
భారత రాజకీయ వ్యవస్థ, రూరల్ అభివృద్ధి, ఆర్థిక పరిణామాలు
మెంటల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
సుస్థిర అభివృద్ధి, పర్యావరణ సంరక్షణ
విపత్తుల అత్యవసర నిర్వహణ - భూకంపం, తుఫాన్లు, వరదలు, ప్రకృతి విపత్తులు- ప్రభావాలు, నివారణ విధానాలు-మానవ జోక్యంతో జరిగే ప్రమాదాలు-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడవుల సంక్షరణకు తీసుకుంటున్న చర్యలు-అమలు చేస్తున్న పథకాలు
పర్యావరణ సమస్యలు (పొల్యూషన్, గ్లోబల్ వార్మింగ్)
పార్ట్ బి- జనరల్ సైన్స్ అండ్ జనరల్ మేథమెటిక్స్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ
సైన్స్ (పదోతరగతి స్థాయి):
విశ్వం, ఆధునిక భౌతిక శాస్త్ర అంశాలు, శాస్త్ర, సాంకేతిక అంశాలు, శక్తి వనరులు-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-టెలీ కమ్యూనికేషన్స్-అంతరిక్ష విజ్ఞానం. విశ్వం-పరిణామాలు
గణితం:
వాస్తవ సంఖ్యలు, సమితులు, వర్గ సమీకరణాలు, సరూప త్రిభుజాలు, నిరూపక రేఖాగణితం, త్రికోణమితి, అనువర్తనాలు, గణిత నమూనా విధానాలు, రేఖాగణితం, వృత్తాలు, స్టాటిస్టిక్స్ , అర్థమెటిక్, జామెట్రీ
గణాంకాలు: డేటా ప్రదర్శన (గ్రాఫ్, చార్టు), మెజర్స్

2. మెయిన్ ఎగ్జామ్
ఒక వ్యాసం: ఆంగ్లం / తెలుగు / ఉర్దూ లో (45 నిమిషాలు, 50 మార్కులు)
Paper I - Objective (100 ప్రశ్నలు, 100 మార్కులు, **100 నిమిషాలు):**
General Studies & Mental Ability లో Prelims లక్ష్యంగా చెప్పిన అంశాలు మరింత లోతుగా
Paper II – Objective (100 ప్రశ్నలు , **100 మార్కులు, 100 నిమిషాలు):**
General Science & General Mathematics - SSC స్థాయి గణితం, సైన్స్‌పై శాస్త్రీయ, గణిత అంశాలతో
3. Computer Proficiency Test (CPT)
60 నిమిషాలు, 100 మార్కులు కంప్యూటర్ అంశాలపై ప్రావీణ్యం
SC/ST - 30, BC - 35, OC - 40 శాతం పూర్తి స్కోరు అవసరం
సాధారణ గణితపు అంశాలు (అంకెలు, శాతాలు, సిద్ధాంతాలు)
సైన్స్ అంశాలు (సూర్యశక్తి, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, (Ecosystem)
సామాజిక విజ్ఞానం (చరిత్ర, భౌగోళికం, రాజకీయ శాస్త్రం, ఆర్థికత)
మానసిక సామర్థ్యం (రీజనింగ్, పజిల్స్, లాజిక్)
పర్యావరణ / డిజాస్టర్ నిర్వహణ
సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం (వర్డ్, స్ప్రెడ్షీట్, ప్రెజెంటేషన్)

సిడాక్‌లో 280 ఉద్యోగాలు

బెంగళూరులోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (CDAC Recruitment 2025) అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రీసెర్చ్ (ACR) ప్రాజెక్ట్ కోసం 280కి పైగా ఉద్యోగ ఖాళీలను ప్రకటించింది. సిడాక్ అనేది భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (MeitY) ఆధ్వర్యంలో పనిచేసే ఒక సంస్థ. ఇది భారతదేశ సాంకేతిక శక్తిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రీసెర్చ్ (ACR) ప్రాజెక్ట్ ద్వారా హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (HPC), AI సాంకేతికతలలో భారత్‌ను స్వావలంబన చేయడమే సిడాక్ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా సిడాక్ దేశవ్యాప్తంగా ఉన్న తన కేంద్రాల్లో ఒప్పంద పద్ధతిలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో డిజైన్ ఇంజనీర్, టెక్నికల్ మేనేజర్ వంటి ఉన్నత స్థాయి పోస్టులు ఉన్నాయి. వీటికి ఎంపికైన వారికి ఏడాదికి రూ.18 లక్షల నుంచి రూ.42 లక్షల వరకు జీతం లభించనుంది. ఈ పోస్టులకు ఎలా దరఖాస్తు చేయాలి? ఏమేమి అర్హతలు కావాలి? తుది గడువు ఎప్పుడు? వంటి విషయాలను తెలుసుకుందాం. అభ్యర్థులు BCA, B.Sc, B.Tech/B.E, M.Sc, MCA, PG డిప్లొమా, M.Phil/Ph.D (సంబంధిత రంగాలలో) అనుభవం కలిగి ఉండాలి. కానీ డిజైన్ ఇంజనీర్ పోస్టులకు ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

సిడాక్‌లో చేరడం అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదు. ఒక మంచి కెరీర్ అవకాశం లభిస్తుందని చెప్పొచ్చు. ఈ ఉద్యోగాలు ఆకర్షణీయ జీత భత్యాలతో పాటు అనేక ప్రయోజనాలను అందిస్తాయి. అనుభవం ఆధారంగా జీతంలో అదనపు ఇంక్రిమెంట్లు కూడా లభిస్తాయి.

- డిజైన్ ఇంజనీర్ ఈ1: 203
- సీనియర్ డిజైన్ ఇంజనీర్ ఈ2: 67
- ప్రిన్సిపల్ డిజైన్ ఇంజనీర్ ఈ3: 05
- టెక్నికల్ మేనేజర్ ఈ4: 03
- సీనియర్ టెక్నికల్ మేనేజర్ ఈ5: 01
- చీఫ్ టెక్నికల్ మేనేజర్ ఈ6/ కన్సల్టెంట్ : 01

మొత్తం పోస్టుల సంఖ్య: 280 .
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.
ఉద్యోగం చేసే ప్రాంతం : బెంగళూరు.
దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ ద్వారా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జులై 29, 2025.

తాత్కాలిక 'అగ్నివీర్'లకు ఆహ్వానం

భారత సైన్యంలో స్వల్పకాలిక సేవలందించేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అగ్నిపథ్'లో భాగంగా అగ్నివీర్‌ల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. భారత వైమానిక దళం (ఐఎఎఫ్) ఈ అగ్నివీర్-2025-26 సంవత్సరాలకు పోస్టుల భర్తీకిగాను ప్రకటన విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జులై 11 నుంచి ప్రారంభమైంది. అదేనెల 31న తుది గడువు. పరీక్ష సెప్టెంబర్ 25న జరుగుతుంది. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 550 చెల్లించాలి. దరఖాస్తు రుసుమును డెబిట్ కార్డ్, క్రెడిట్‌కార్డ్, నెట్ బ్యాంకింగ్ లేదా యూపీఐ ద్వారా చెల్లించొచ్చు. అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ agnipath-vayu.cdac.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నిపథ్ పథకంలో భాగంగా వివిధ విభాగాల్లో అగ్నివీర్ నియామకానికి ఆర్మీ ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సాధారణంగా ఈ నియామకాల్లో అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, టెక్నికల్, ట్రేడ్‌మెన్ వర్గాల్లో నియామకాలు జరుగుతుంటాయి. ఆయా పోస్టులకు నోటిఫికేషన్ వచ్చినప్పుడు అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. భారత వైమానిక దళంలో సేవ చేయాలనుకునే దేశంలోని యువతకు ఇది మంచి అవకాశమేనని చెప్పొచ్చు. ఈ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేయాలంటే, అభ్యర్థులు జనవరి 1, 2006 నుంచి జులై 1, 2009 మధ్య జన్మించి ఉండాలి. అర్హత సాధించిన అభ్యర్థి, ఎంపికలో అన్ని దశలను విజయవంతంగా పూర్తిచేస్తే, నియామక తేదీ నాటికి గరిష్ట వయస్సు 21 ఏళ్లకు మించకూడదు. ఇది యువతకు భారత వైమానిక దళంలోకి ప్రవేశించేందుకు సరైన సమయం.

విద్యార్హతలు: ఈ నోటిఫికేషన్‌కు విద్యార్హతల్లో కొన్ని విభాగాలుగా వివరించారు. సైన్స్ సబ్జెక్టులు (గణితం, ఫిజిక్స్, ఇంగ్లీష్) ఉన్న అభ్యర్థులు, 10+2 లేదా ఇంటర్ తత్సమాన పరీక్షలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, ఇంగ్లీష్‌లో కూడా 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. లేదా గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ కాలేజీల నుండి ఇంజినీరింగ్ సంబంధిత బ్రాంచ్‌లలో 3 సంవత్సరాల డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. మొత్తం మార్కుల్లో 50 శాతం ఉండాలి, ఆ డిప్లొమాలో ఇంగ్లీష్ లేకపోతే, మరో పరీక్షలో (ఇంటర్, మెట్రిక్) ఇంగ్లీష్ 50 శాతం ఉండాలి.

"తను చెప్పదలచుకున్న సంగతి
తనకే స్పష్టంగా తెలీనప్పుడు, తన
చాతగాని తనాన్ని, అర్థ అస్పష్టతనీ
ఛందస్సు చీరల వెనకా, అలంకారాల
మధ్యా, కఠిన పదాల బురఖాల్లోనూ దాచి
మోసగించాలని చూస్తాడు కవి. ముఖ్యంగా
సహజ సౌందర్యం తక్కువైనప్పుడు!"
- చలం

విజయ దుందుభి

ముళ్ళ డొంకల మధ్య రాళ్ళ గుట్టల్లో
పలుగు పారల కౌకుదెబ్బలు తిని
కాయలు కాసిన ఆ మట్టిచేతులు ...
ముట్టుకుంటే చాలు కరడు గట్టిన
విత్తు సైతం ప్రాణం పోసుకొని
మెత్తని పువ్వై పరిమళిస్తుంది!
తెల్లని బువ్వై కడుపు నింపుతుంది!

అలాంటి అన్నం పెట్టే నేల తల్లి
పాలిండ్లను కర్కశంగా కోసేసి
రియల్ ఎస్టేట్ కోటలు కట్టాలని
ఖరీదైన కోటేసుకున్న నాజూకు చేతులు
భూ దాహంతో నిక్కి నీల్గుతోంటే...
ఏ మెరటు వేళ్ళ నరాల్లోనైనా
కొత్త చైతన్యపు నెత్తురు
సలసలా మరిగి జలజలా ప్రవహించదా?
రహదార్ల మీద పోటెత్తే పిడికిళ్ళై
పిడుగుల వర్షాన్ని కురిపించదా?

గద్దెల మీద ప్రజాస్వామ్య
సుద్దులు చెప్పే రుద్రాక్ష పిల్లులు
కుట్రపూరిత ఎత్తుగడలతో
ఉక్కుపాదాల కింద నొక్కిపెట్టాలని
ఎంతగా ఉవ్విళ్ళూరినా
పొంగులెత్తే ఆ ఉడుకు నెత్తుటి
పరవళ్ళ ప్రతాపానికి
పాదాలు కాస్తా మెత్తగా ఉడికిపోయి
మట్టికొట్టుకుపోవాల్సిందే కదా....!

మొన్న సోంపేట థర్మల్ ప్లాంట్
నిన్న దేవనహళ్ళి ఏరో స్పేస్ పార్క్
భూసేకరణ వ్యతిరేకోద్యమాలు
హద్దులు దాటిన ప్రభుత్వాల
ఎద్దు కొమ్ముల పొగరు దించిన వైనం
రేపు కరేడు భూముల కర్షక వీరుల
కన్నుల్లో ఆశాజ్యోతులై జ్వలిస్తాయి!
వారి త్యాగాలే బతుకు స్వప్నాలై
పచ్చ పచ్చని పంట పొలాల్లో
విజయ దుందుభిలు మోగిస్తాయి!

– పతివాడ నాస్తిక్
944 1724 167

భళా!

నువ్వు మాత్రం
మొర ఎవరికి వినిపిస్తావు
నీ చెమటెక్కడో
అందనంత దూరంలో
గంధమై పూస్తుంటే!
నీ బతుకు
ఎంత దిగాలుగా ఉంటేనేం!
నీ ఘనత
ఖండాంతరాల్లో
కిరీటమై వెలుగుతుంటే!
నీ అరుపులన్నీ
గావుకేకలైతేనేం!
చట్ట సభల్లో నీ గొప్పలన్నీ
జబ్బలు చరుచుకొని
బల్లలు విరగ్గొడుతుంటే ...
నీ ఆకలి కేకలన్నీ
అరణ్య రోదనలైతేనేం
ఏ కంప్యూటర్ స్క్రీన్ మీదో
గొప్ప గొప్ప పథకాలలో
నీ ముఖం వెలిగిపోతుంటే!

కూడూ గూడు లాక్కుపోయిన
నిరాశ్రయుడువైతేనేం!
పతాక శీర్షికల్లో నీ ఉదారత,
బహుళజాతి కంపెనీ భాగస్వామిగా
నీ రాజసం ఉట్టి పడుతుంటే!
రోడ్డున పడిన
నీ బతుకు ఎదురుగా
పచ్చని హోర్డింగుల్లోనూ
ఎండిన డొక్కల్లో సొబగులద్దిన
బొమ్మ మాత్రం నీదే ఉంటుంది!

భళా!
నువ్వు మాత్రం రైతు రాజువే!
నీ అరచేతికిచ్చిన అద్దంలో
చంద్రుడ్ని చూపిస్తున్నంతకాలం,
నీ మూతికి రాసిన బెల్లం
ఊరుకోబెడుతున్నంత కాలం,
నువ్వు రాజువే.. ఉత్తి రాజువే!

– వినోద్ కుత్తుం
96343 14502

విశ్వ నరుడిగా...

విశ్వమంతా వివక్షా భావాలు
సవాలక్ష రూపాల్లో సవారీ చేస్తూ
మానవ విజ్ఞతను సవాలు చేస్తూ
అంతర్జాల యుగంలోనూ
అంతర్ధానమవ్వని భేషజాలు
అంతులేని అజ్ఞానపు ఆనవాళ్లు
సాటి మనిషి ఆత్మ గౌరవం
సయించలేని హీన గర్వం
అర్హులను అణగదొక్కే
గర్హనీయ కుటిల పర్వం
పక్షపాత ధోరణితో
సగం చచ్చుబడిన సమాజ దేహం

సహోదరా! మేలుకో!
ఉగ్గుపాలతో నేర్చిన వివక్ష
ఒక్క ఉదుటున మాయం కాదు
తరాలుగా మిగిలిన ఆధిపత్యపు మరక
ఒక్క ఉతుకుతో దూరం కాదు

అక్షరాల ఆయుధాలతో
భావ చైతన్యం సాధించాలి
బాధిత మెదళ్ళలో
సమిష్టి తత్వం పెంచాలి
సమర శీలత నేర్పాలి
సమ సమాజం సాధించేందుకు
సమానత్వం కాపాడేందుకు
ఉక్కుముక్కు రాబందుల్ని
ఐక్యంగానే ఢీ కొట్టాలి
మానవ ఉన్నతి చూపిస్తూ
అంతిమ విజయం చేపట్టాలి!

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931

అతడి కల, కలమూ ప్రజాపక్షమే!

స్మరణ

చౌదరి ఫైజ్ అహ్మద్ ఫైజ్ (13 ఫిబ్రవరి 1911 – 20 నవంబర్ 1984) ప్రఖ్యాత పంజాబీ, ఉర్దూ కవి. ఆయన రచనలు, ఆలోచనలు గొప్ప అభ్యుదయాన్ని ప్రచారం చేశాయి. అధ్యాపకుడిగా, సైనిక అధికారిగా, సంపాదకుడిగా, కవిగా, రచయితగా, కమ్యూనిస్టు నాయకుడిగా ఆయన ఎంతో ప్రాచుర్యం పొందారు. పంజాబ్ ప్రావిన్స్‌లో జన్మించిన ఫైజ్ లాహోర్‌లోని ప్రభుత్వ కళాశాల, ఓరియంటల్ కళాశాలలో చదువుకున్నాడు. బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సేవలందించాడు. భారతదేశ విభజన తర్వాత, ఫైజ్ ఆంగ్ల భాషా దినపత్రిక పాకిస్తాన్ టైమ్స్, ఉర్దూ దినపత్రిక ఇమ్రోజ్‌లకు చీఫ్ ఎడిటర్‌గా పనిచేశాడు. 1951లో లియాఖత్ పరిపాలనను కూలదోసి, వామపక్ష, సోవియట్ అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే కుట్రలో పాల్గొన్నారనే ఆరోపణలతో అరెస్టు చేయబడి జైలు శిక్ష అనుభవించాడు. అనంతరం మాస్కో, లండన్‌లో గడిపి, ప్రోగ్రెసివ్ రైటర్స్ ఉద్యమంలో ప్రముఖ సభ్యుడయ్యాడు. సైనిక నియంత అయూబ్ ఖాన్ ప్రభుత్వం పతనం, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం తర్వాత, అతను జుల్ఫికర్ అలీ భుట్టోకు సహాయకుడిగా పనిచేశాడు. కానీ మరొక సైనిక నియంత జియా ఉల్–హక్ చేతిలో భుట్టో ఉరితీయబడిన తర్వాత బీరుట్‌కు బహిష్కరించబడ్డాడు. మార్క్సిస్టు సిద్ధాంతం ఆలంబనగా మార్పు కోసం కృషి చేసిన కవి, ఆరచణవాది ఫైజ్. సోవియట్ యూనియన్ ద్వారా లెనిన్ శాంతి బహుమతి (1962) అందుకున్న మొదటి ఆసియా కవి ఆయన. నోబెల్ సాహిత్య బహుమతికి కూడా నామినేట్ అయ్యాడు.

ఫైజ్ కౌమార దశ చాలామంది యువకుల మాదిరిగానే సాగింది. సియాల్‌కోట్‌లో పొరుగున ఉన్న ఓ యువతి ప్రేమలో పడ్డాడు. కానీ, తన భావాలను వ్యక్తపరచడానికి ధైర్యం చాల్లేదు. తరువాత ఉన్నత చదువు కోసం లాహోర్‌కు వెళ్లాడు. ఆమె వివాహం చేసుకుంది. అతడు అమృత్‌సర్‌లో ఇంగ్లీష్ లెక్చరర్‌గా చేరాడు. అప్పుడే మార్క్సిజం ప్రేమలో పడ్డాడు. ఆ ప్రేమ విశ్వప్రేమ అయింది. కవిత్వమై వెలుగొందింది. భారత ఉపఖండపు రాజకీయ కవిత్వానికి మార్గదర్శకుడయ్యాడు. ఉర్దూ సాహిత్యంలో మహోన్నత వ్యక్తిగా, లెనిన్ శాంతి

బహుమతి గ్రహీతగా ఎదిగాడు. తన ప్రారంభ రోజులు అందించిన అనుభవమే తనను గొంతు లేనివారికి స్వరంగా మిగిల్చాయని చెబుతాడాయన.

ఔర్ భీ దుఖ్ హై జమానే మే మొహబ్బత్ కే శివా, రహతేన్ ఔర్ భీ హైన్ వాస్ల్ కి రహత్ కే శివా, ముఝ్ సే పహ్లీ సి మొహబ్బత్ మేరే మెహబూబ్ నా మాంగ్ (ప్రపంచానికి ఇతర సమస్యలు ఉన్నాయి. ప్రేమికుడి వెచ్చని ఆలింగనం కంటే ఇతర సౌకర్యాలు ఉన్నాయి. నేను ఒకప్పుడు నా ప్రేమను అడిగాను. నిన్ను ఇష్టపడలేదు). అలా ఫైజ్ రొమాన్స్, రాజకీయాలను పెళ్లి చేసుకున్నాడు.

ఫైజ్‌కు మహమూద్–ఉజ్–జాఫర్, ఆయన భార్య రషీద్ జహాన్‌తో స్నేహం ఏర్పడింది. 1932లో ఫైజ్ ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్న నలుగురు స్నేహితులతో కలిసి అంగారే (అగ్ని) అనే చిన్న కథల సంకలనం, ఒక నాటకం ప్రచురించాడు. ఆ కథలు ఎక్కువగా స్త్రీ స్వేచ్ఛ గురించి, సమానత్వం గురించి మాట్లాడాయి. సంప్రదాయవాదంలోని బోలుతనంపై విమర్శ చేశాయి. ఫలితంగా ఆ కథల పుస్తకం నిషేధానికి గురైంది. కానీ, ఆ సాహిత్యాపుటాలోచనలోని కొత్త కాంక్షే భారతదేశంలో ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ ఏర్పాటుకు దారి తీసింది. రచయితల సంఘం ఏర్పాటులో ఫైజ్‌ది కీలకపాత్ర.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో ఫైజ్ సైన్యంలో చేరాడు. ఆవిధంగా ఆయన కవిత్వ సృజనకు కొంత విరామం వచ్చింది. 1947లో తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. వామపక్ష భావాలు కలిగిన ఆంగ్ల భాషా వార్తాపత్రిక ది పాకిస్తాన్ టైమ్స్ సంపాదకుడిగా చేరాడు. దేశ విభజన సమయంలో జరిగిన మత హింసతో నిరాశ చెందిన ఆయన, "యే దాఘ్ దాఘ్ ఉజాలా యే షబ్–గజిదా సహర్, వో ఇంతిజార్ థా జిస్ కా యే వో సహర్ తో నహిన్" (చీకటితో తడిసిన ఈ వెలుగు, సంధ్యా సమయంతో కలుషితమైన తెల్లవారుజాము లాంటిది. ఇది మనం ఎదురుచూసిన తెల్లవారుజాము కాదు) అని రాశారు.

1951లో లియాఖత్ అలీ ఖాన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కమ్యూనిస్టులు కుట్ర చేశారని ఆరోపిస్తూ, వామపక్ష సైనిక అధికారులతో పాటు ఫైజ్‌ని కేడా అరెస్టు చేశారు. జైల్లో పెట్టారు. ఆయన జైలు గోడల మధ్య నుంచే దస్త్–ఎ సబా (ది హ్యాండ్ ఆఫ్ ది బ్రీజ్), జిందాన్ నమా (ప్రిజన్ క్రానికల్స్) అనే రెండు పుస్తకాలు వెలువరించాడు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఫైజ్ తన ఆశను, ఆశయాన్ని వదులుకోలేదు. జైలు గదిలోనే... ఖఫాస్ ఉదాస్ హై యారో సబా సే కుచ్ తో కహెూ. కహిన్‌తో బహర్–ఎ–హుదా ఆజ్ జిక్ర్–ఎ–యర్ చలే (పంజరం విచారంగా, నిశ్శబ్దంగా ఉంది. గాలికి ఏదైనా చెప్పండి. దేవుడి కొరకు, నా ప్రియమైన వ్యక్తి గురించి మాట్లాడుకుందాం) అని రాశాడు.

నాలుగేళ్ల తరువాత జైలు నుంచి విడుదలయ్యాడు ఫైజ్. అప్పటికి చాలా మార్పులు వచ్చాయి పాకిస్తాన్‌లో. పాకిస్తాన్ సీటో, సెంటోలపై సంతకం చేసి, ఆయన ద్వేషించే అమెరికా పక్షాన చేరింది. తరువాత కొన్నేళ్లు సాగాయి. భుట్టో అధికారంలోకి వచ్చాక– ఆయన్ని విద్యా మంత్రిత్వ శాఖకు సాంస్కృతిక సలహాదారుగా నియమించాడు. ఫైజ్ చొరవతో పాకిస్తాన్‌లోని జానపద కథలు, కళలపై విస్తారమైన పరిశోధన, నమోదు సాగాయి.

1974లో ఫైజ్ భుట్టోతో కలిసి బంగ్లాదేశ్‌కు వెళ్లాడు. షేక్ ముజిబుర్ రెహమాన్ అభ్యర్థన మేరకు హమ్ కీ ఠహ్రే అజ్ఞాబీ ఇత్నీ ముదరతోన్ కే బాద్‌ను స్వరపరిచాడు. ఫిర్ బనేంగే అష్నా కిత్నీ ములాఖతోన్ కే బాద్ (ఆతిథ్యం ఇచ్చినప్పటికీ, మేము అపరిచితులమే, మళ్లీ స్నేహితులుగా మారడానికి ఎన్ని సమావేశాలు పడతాయో ఎవరికి తెలుసు) అని రాశాడు. ఆనాటి రాజకీయ పరిస్థితికి అద్దం పట్టే కవితా పాదాలు అవి.

తరువాతి కాలంలో భుట్టోను అరెస్టు చేశారు. మళ్లీ అశాంతి నెలకొంది. ఫైజ్ స్వయంగా బీరూట్‌కు మారిపోయాడు. ఆసియా, ఆఫ్రికన్ రచనలను ప్రోత్సహించడానికి స్థాపించిన లోటస్ పత్రికకు సంపాదకుడిగా మారారు. ఆ మ్యాగజైన్ కార్యాలయాన్ని యాసర్ అరాఫత్ ప్రారంభించారు. స్వదేశం నుంచి దూరంగా బతకటం ఫైజ్‌కి సమస్యే అయింది. తాను దూరంగా ఉన్నట్లు, తన ప్రజల నుంచి వేరు చేయబడినట్లు, తన ప్రజల కోసం ఆరాటపడుతున్నట్లు అతని స్నేహితులు గుర్తించారు. మేరే దిల్, మేరే ముసాఫిర్, హువా ఫిర్ సే హుక్మ్ సదిర్, కి వతన్–బదర్ హెూన్ హమ్ తుమ్ (నా హృదయం, నా ప్రయాణికుడు, ఆదేశం మళ్ళీ జారీ చేయబడింది. మేము మళ్ళీ బహిష్కరించబడ్డాము) వంటి రచనలు ఆకాలంలోనే ఆయన కలం నుంచి కాదు; హృదయం నుంచి వెలువడ్డాయి.

ఫైజ్ రాసిన అత్యంత శాశ్వతమైన రచన హమ్ దేఖేంగే. మానవత్వాన్ని, మనిషి ప్రాధాన్యాన్ని చాటిచెప్పిన ఈ రచన మత ఛాందసుల విమర్శలను ఎదుర్కొంది. ఫైజ్ మద్దతు ఇచ్చిన ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం నుంచి ప్రేరణ పొందింది. ఈ కవిత ఇచ్చే సందేశం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కవిత ముగింపులో కవి ఇలా అంటాడు : "ఉత్తేగా అనల్ హక్ కా నారా, జో మై భి హు ఓర్ తుమ్ భి హెూ". బస్ రాజ్ కరేగి ఖల్కే ఖుదా జో మై భి హు ఓర్ తుమ్ భి హెూ. అనల్–హక్ అంటే 'నేనే సత్యం'. ఫైజ్ ఈ నినాదాన్ని అందరూ లేవనెత్తుతారని ఊహించాడు. ఇస్లాం, యూదు, క్రైస్తవ మతం వంటి సెమిటిక్ మతాలలో దేవుడు, సృష్టి మధ్య కఠినమైన ద్వంద్వత్వం ఉంది. దీనికి విరుద్ధంగా సూఫీ తత్వంలో 'నేను దేవునితో ఒకడిని' అనే అద్వైత భావన ప్రతిధ్వనిస్తుంది. ఈ వివరణ ద్వారా, ఈ కవిత యొక్క సందేశం ఏమిటంటే – "మానవులే అంతిమ సత్యం – దైవత్వం మానవత్వంలో ఉంది." ఈ మాటల్లోని పరమార్థం ప్రపంచ ప్రజలకు ఇంకా ఆచరణలోకి రావాల్సి ఉంది.

(ది టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో) ✦

బహుళ వర్ణ స్వరం భుజంగరావు 'గీసి చెరిపే బొమ్మ'

పుస్తకం

"గీసి చెరిపే బొమ్మ" కవితా సంపుటి కవిగా కంచరాన భుజంగరావు తనని తాను ఎన్నిసార్లు చెరుపుకొని స్పష్టమైన, అందమైన ఒంపులు గల బొమ్మగా మలుచుకున్నాడో తెలియజేస్తుంది. 'నీటి గింజల పంట'లో కంచరాన భుజంగరావు హృదయం దించిన తల ఎత్తకుండా తన తోవన పోయే పసిపిల్లవాడి మాదిరి కనిపిస్తుంది. అతని చూపంతా మట్టిలోనూ, మట్టిని నమ్ముకున్న రైతులోనూ, తన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లోనూ, కవిత్వం చుట్టూ ఎక్కువగా చొచ్చుకుపోయింది. అక్కడ అతని కవిత్వం కొలవలేనంత లోతు. ఈ 'గీసి చెరిపే బొమ్మ'లో ఆ లోతుకు వైశాల్యం తోడైంది. యవ్వనంలో అడిగిన పిల్లాడు ప్రపంచంలో జరిగేటువంటి ప్రతి విషయాన్ని ఆకళింపు చేసుకొని పరిపక్వత సాధించడానికి చేసే ప్రయత్నంగా ఈ 'గీసి చెరిపే బొమ్మ' రూపు దిద్దుకుంది.

'నీటి గింజల పంట'లో మట్టి రంగు, వాసనలు ఆసాంతం మనని అంటిపెట్టుకొని ఆర్ద్ర స్వరమైన కవి ఈ 'గీసి చెరిపే బొమ్మ'లో అష్ట వర్ణాల స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశాడు. సొంత ఊరు, ప్రేమికులు, శ్రామికులు, సముద్రం, యుద్ధాలు, ప్రజల అసహాయత, నాయకుల అమాయకత్వం, శ్మశానం, ఆకాశం, ఖగోళం ... ఇలా అణువు మొదలుకొని విశ్వమంతటిని దర్శించి అందమైన ఇంద్రధనస్సు లాంటి వర్ణాలని ఈ కవిత్వంలో పొందుపరిచాడు. దానికి దుఃఖమనేటువంటి నల్లటి రంగు కూడా తోడై అష్టమవర్ణ స్వరంగా భాసించాడు. విప్లవ స్వరమై రుధిర వర్ణాన్ని అద్దాడు. ఇలా బహుళ వర్ణ స్వరంగా ఎదిగాడు. నీటి గింజల పంట కేవలం దుఃఖాన్ని మాత్రమే వ్యక్తం చేసేది అయితే గీసిచెరిపే బొమ్మ నవరసాల సమ్మిళితం. ఎంతటి కటిక దరిద్రుడికైనా తన జీవిత కాలంలో ఏదో ఒక క్షణం ఆనందం కలుగుతుందనే ఒక స్పృహ ఈ గీసి చెరిపే బొమ్మలో కవిత్వ వైవిధ్యానికి కారణంగా కనిపిస్తుంది.

ఈ కవితా సంపుటిలో భుజంగరావు సమస్యలకు కొత్త కారణాలను అన్వేషించాడు. సమస్యలకు కొత్త పరిష్కారం మార్గాలను సూచించాడు. ఎవరూ చూడని దృష్టి కోణంలో మనిషి బాధల్ని సందర్శించాడు.

"ప్రాణం పోసుకునే రేపటి వసంతం కోసం
కొత్త పదాలతో అడవికి అంటూ కడతాను
నాలోని చివరి పక్షితో రెక్క చాలనానికి
తీరమంతటా చెట్లను సిద్ధం చేస్తాను
కొమ్మకు కొన్ని కాయలుగా నా పద్యాలుంచి
కొత్త తరం బాటసారుల కోసం
మజిలీకు ఒక మధుర ఫలం కానుకిస్తా"నంటాడు

భుజంగరావు తన కవిత రచన ప్రయోజనాన్ని తెలుపుతూ. ఉత్తరాంధ్రలో రాబోయే తరాలకు ఇక్కడ చారిత్రక, అస్తిత్వాలను తన కవిత్వంతో రంగరించి అందించడానికి విరగకాసిన పళ్ళతో నిండిన చెట్టులా తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించాడు.

అంతేకాకుండా తాత్వికత అనే కొత్త రూపాన్ని ధరించాడు కవి ఈ సంపుటిలో. ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు వాటి కారణంగా బలైపోతున్న అమాయకులు, ఆవిరైపోతున్న బాలల ఆశలు, యుద్ధాన్ని ప్రేరేపించే శక్తులు ఇవన్నీ అతని కవిత్వంలో మనకు శాంతి అవసరం అనే స్పష్టమైన సందేశాన్ని అందిస్తాయి. కొన్ని కవితలు మారిపోతున్న మనిషిని గురించి, మానవత్వం అంటే తెలియని కొత్త తరం మనిషిని గురించి, చుట్టూ తన వారు ఉన్నా గాని బంధమంటే ఏమిటో తెలియకుండా తనలోకి తాను కుంచించుకుపోతున్న మనిషిని గురించి అద్భుతంగా వర్ణించాడు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణమైన అసంపూర్తి ప్రాజెక్టుల ప్రస్తావన, దానివలన వ్యవసాయంలో నష్టపోతూ వలసబాట పడుతున్న రైతుల ఆవేదన, దశాబ్దాలుగా ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయాన్ని కళ్ళకు కడుతుంది 'నాగధార' కవిత.

పేరుకు గొప్పగా వంశధార, నాగావళి నదులున్నాయని చెప్పుకోవడమే కానీ సాగునీరుగా వాటి వినియోగించుకోవటంలో విఫలమవటంవల్ల స్వల్ప ప్రయోజనాలనే పొందగలుగుతున్నాం అంటూ ఏ విధమైన ఆనకట్టలు లేకపోవడంతో.. "పుట్టకన్నంలో పాలు కురిసినట్టు/ ఈ నేల నరాల్లోకి దిగుడువాగై ప్రవహిస్తుంది నాగధార" అంటూ నదులు నిరుపయోగంగా సముద్రంలో కలవడాన్ని పుట్టలో పాలు కురిసినట్లు అనే ఉపమానంతో ఎంతో సరళంగా వివరించాడు. 'పొట్టిరెక్కల పిట్ట కథ' కవిత అనేక వర్తమాన సమస్యల్ని ప్రస్తావిస్తుంది. ప్రధానంగా వలసబాట, అమలు కాని హామీలు, తరాలుగా జరుగుతున్న వలస ప్రయాణం బతకడానికే గాని హాయిని పొందడానికి కాదనే వాస్తవాన్ని ప్రకటిస్తుంది. మత్స్యకారుల ఇబ్బందులు, ఆదివాసీల హాహాకారాలు.. వీటన్నింటినీ ఆర్చలేని తీర్చలేని రాజకీయం ఎంత కుటిలమైనదో అంటూ తన బాధను వ్యక్తం చేస్తాడు. 'గండికోట: ద గ్రేట్ కెన్యాన్' కవిత ఒక చారిత్రక సాక్ష్యంగా, 21వ శతాబ్దపు కైఫీయత్తుగా భవిష్యత్ తరాల్లో నిలిచిపోతుంది.

సొంత ఇంటి కల తీర్చుకోలేని ఒక మధ్య తరగతి వ్యక్తి హృదయావిష్కరణమే 'స్వీట్‌హోమ్ స్వప్నం'. ఈ కవితలో భుజంగరావు చేసిన అద్భుతమైన ప్రయోగాలు, అతని ఊహాశక్తి మనకు అమితాశ్చర్యాన్ని కలిగిస్తాయి.

"ఈమధ్యే/ నేను ఒక ఇంటి జాగా కొనుక్కున్నాను / జేబు నిండా అప్పులు మిగిలి / ఒక నేలముక్క దక్కింది గాని / అప్పుడే అక్కడే నా నిద్ర పక్క దులిపేసుకుందంటాడు/ ... మరుక్షణమే తలలోకి / బెంగ పురుగు దొంగల దూరి
నా డ్రీమ్ గార్డెన్ను తొలిచేస్తుంది" ఈ రెండు ఉదాహరణలు అతని ప్రయోగచాతుర్యానికి, అసమానమైన ఊహాశక్తికి చక్కని ఉదాహరణలు. 'చీకటి ఆకాశం', 'పూరీడు పిట్ట పాట' కవితలు ఉత్తరాంధ్ర యాసకు మకుటాయమానాలు. 'నిషేధ ప్రకటన' కవిత అటు వలస యాతనల్ని, ఇటు స్త్రీ దృష్టి కోణాన్ని రెండింటిని ఆవిష్కరిస్తుంది. కుటుంబంగా వలస పోయే వారి పరిస్థితులకు భిన్నంగా ఇంటి యజమాని కుటుంబ పోషణ కోసం ఎక్కడికో వలసపోయి అతని భార్య ఒంటరిగా సొంత ఊరిలో ఉండి బతుకు వెళ్ళదీయడమంటే ఎంత కష్టమో ఈ కవిత వివరిస్తుంది.

"ఎక్కడో అతను.. ఇక్కడ ఎడతెగని నిరీక్షణకు
పక్కా కాలనీ యిల్లు కట్టించి
అప్పుల పాలయ్యే ఆమెను నేను
తరతరాలకు ఇదే వరస/ కాలం మారినా తీరు మారని వలస!"

అంటూ నుదుటిన సింధూరం ఐదవతనాన్ని సూచిస్తున్నా తన పక్కన భర్త లేని లోటును మరేవి, ఎప్పటికీ తీర్చలేవనే స్పష్టత ఈ కవితలో కనిపిస్తుంది.

'గురుబోధ' కవిత ఒక గురువు నిరంతర విద్యార్థిగా ఎలా జీవితాన్ని మలుచుకుంటాడో, క్రమశిక్షణ, బాధ్యతల్ని శ్వాసగా ఎలా మార్చుకుంటాడో, మంచి ఉపాధ్యాయుడిగా విద్యార్థుల హృదయాల్లో ముద్ర వేసుకోవడానికి ఎంత తపన పడతాడో, దానికి తగ్గట్టుగానే బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగడానికి విద్యార్థులకు ఎంతటి స్ఫూర్తిని అందిస్తాడో విజ్ఞాన సాగరంలో ఈత ప్రారంభించిన అతడు కొత్తగా విజ్ఞాన సాగరంలో ఈత కొట్టడానికి అడుగులు వేస్తున్న విద్యార్థులకు ఎలాంటి తర్ఫీదు ఇస్తాడో .. సుదీర్ఘ విశ్లేషణకి ఆస్కారం కలిగిన అలతి అలతి పదాలతో పేన్నుతో తెలియజేస్తుంది. 'బోలు ఇల్లు' కవితలో చివరి వాక్యాలు మొత్తం కవితా సారాన్ని పట్టిస్తాయి. 'ఆమెకు అల్జీమర్స్ ముదిరిపోయింది సరే, నాదో అనుమానం/ ఖండాలు దాటెల్లిన మా బిడ్డలకూనా?" అని వాపోయే తండ్రి దైన్య పరిస్థితి మన మనసులని ద్రవింప చేస్తుంది. 'సాగర తీరం' కవిత భుజంగరావులో భావుకతకి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. అతని గ్రహణశీలతకు, సునిశితమైన పరిశీలనకు, ప్రేమ హృదయానికి ఆలవాలమైంది. జీవించి ఉండగా పలకరించడానికి అడ్డొచ్చే ఈర్ష్య అహంకారాలు కలిగిన మనుషులు కూడా అయ్యో పాపం అనుకునే చోటు శ్మశానమే అని అంటూ.. 'బతుకంతా తడి కళ్ల వెంటాడినా/ ఆఖరి స్నానం తర్వాత/ కాళ్ల సైతం తడవకూడదని కాబోలు/ నాలుగు భుజాల మీదకి ఎత్తి/ నలుగురు ఇక్కడకు మోసుకు వస్తారు' అంటూ గొప్ప తాత్వికతను ప్రకటించాడు 'రెప్పలాడని వాళ్ళ రంగభూమి' కవితలో. శ్మశానానికి ఉన్నంత హృదయ వైశాల్యం సమాజానికి ఉంటే అర్థాంతరంగా ప్రాణాలు తీసుకునే దుస్థితి పట్టదు కదా అని వర్తమాన సమాజ వైకల్యాన్ని బాహాటంగా వ్యక్తం చేస్తాడు. 'బత్తాయి పెత్తనం' కవితలో ఆపరేషన్ కగార్ ఎందువల్ల ప్రారంభించబడింది? ప్రభుత్వాలు మీడియాను ఎలా నియంత్రిస్తున్నాయి? ఉద్యోగ కల్పన, దారిద్ర్య నిర్మూలన, ఉత్తమ జీవన ప్రమాణాల స్థాయిని పెంచే దిశగా ప్రభుత్వాల ప్రణాళికలు వంటి వాటిని ప్రశ్నించకుండా అసమానతల వైపు ప్రజల్ని నడిపిస్తున్న తీరు, స్వార్థపరులు చేసే దోపిడీలను కప్పిపుచ్చుకునేందుకు అందరినీ పక్కదోవ పట్టించే ప్రయత్నాలు, బలవంతంగా తమ భావాల్ని ప్రజలందరి పైన రుద్దేలా చేస్తూ నడుస్తున్న నేటి రాజకీయ వ్యవస్థలో 'వైవిధ్యాన్ని బతికించాలి' అనే బలమైన నినాదంతో ఈ కవితను ముగిస్తాడు. ఊరందరి కోసం తానొక్కడే శ్రమించి చెరువు తవ్విన సవర బొడ్డు తాతని, తాను పనిచేసే పాఠశాలలో ప్రతి అంగుళాన్ని పరిశుభ్రపరిచి అలసి, చేతిని తలగడగా మార్చుకొని నిద్రపోతున్న పనిమనిషిని, క్షణకాలం కూడా ఏమరపాటు లేకుండా ఏ వైపు నుంచి దాడి జరిగినా దాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ గొర్రెలను కాసుకుని, అందమైన జానపదాలను అల్లిన ఒక గొర్రెల కాపరి గురించి ఇలా తన చుట్టూ ఉన్న వారిని పరిశీలిస్తూ కవితా వస్తువులుగా స్వీకరించడంతో భుజంగరావు తాను చూసే ప్రతి విషయంలోనూ కవిత్వాన్ని వెతుక్కుంటున్నాడని తెలుస్తుంది.

అన్ని వలసలకు కారణం బతుకుతెరువు కష్టం అవ్వడమే కాదు, తాము పుట్టి పెరిగిన ఊరిలో కుల వివక్షకు గురవుతూ, ఆచారాల పేరుతో అణగ తొక్కబడుతూ, ఆకలినీ, అవమానాన్ని ఎదుర్కొంటూ నోరు మూసుకుని బతకలేక, నిరంతరం తలదించుకుని నడవలేక, సమానత్వం దొరుకుతుందనే ఆశతో నగరాలకు వలస వెళ్లే సమూహం కూడా ఒకటి ఉంటుందని వలసలలో ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు భుజంగరావు. "ఒక మైటీ ట్రీ: కొన్ని వాడిపోయిన పూలు" కవితలో గ్రామాన్ని గురించి, నగరాన్ని గురించి, అన్నాన్ని గురించి, అసహాయత గురించి, తిరుగుబాటు గురించి, కుల రాజకీయాల గురించి చక్కనైన నిర్వచనాలను అందించాడు.

కవితా సంపుటి పేరు మొదలు శీర్షికల నిర్ణయం, ఇతివృత్తం ఎంపిక, పదజాలం ... ఇలా ఈ కవితా సంపుటి నిండా ఎన్నో గీసి చెరిపిన అంశాలు పరిపూర్ణత్వాన్ని దారి తీసాయి. ఇక ఈ కవితా సంపుటిలో భాష విషయానికి వస్తే ఎన్నో కొత్త ప్రయోగాలకి నిలయంగా ఈ కవితా సంపుటిని మలిచాడు. 'నిరూహం', 'దుర్రాజకీయాలు', 'నిరంతరత' వంటి నూతన పదాలు భాషలోని సామ్యతతో ఏర్పరిచినవైతే, "సార్కోఫాగస్", "ఫెర్మీ పారడాక్స్", "బటర్ ఫ్లై ఎఫెక్ట్", "ఖోస్ థియరీ" వంటి ప్రయోగాల అంతరార్థాన్ని తెలుసుకోవాలనే తపన తప్పకుండా పాఠకులని అంతర్జాలం వైపు నడిపిస్తాయి. "నీటికంచెలు", "నీటి నిఘంటువు", "అమితాబా", "తంపర కన్నీళ్ళు", "నీటిపొద్దులు", "వెన్నెలాడబ్బా", "జాబిలి పిందెలు" వంటి పదబంధాలు అతని అద్భుత సృజనకి, అసమాన ఊహా పటిమకి తార్కాణాలు. ఈ కవితా సంపుటిలో వర్ణాలని రంగరించి మున్ముందు కవిత్వంలో అనంతమైన ఆధునిక వర్ణాలకి అసలయిన చిరునామాగా కంచరాన భుజంగరావు నిలుస్తాడని ఆశిద్దాం.

– డా. కె.ఉదయ్ కిరణ్
85007 07850

విదేశాలు సరే...ముందు పార్లమెంటుకు రండి

- ప్రధాని మోడీకి ఇండియాబ్లాక్ విజ్ఞప్తి
- 24 పార్టీల నేతల వర్చువల్ సమావేశంలో నిర్ణయం
- ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యానికే ప్రమాదం
- మహిళలు, ఎస్సి, ఎస్టి, మైనార్టీలపై దాడులు పెరగడంపై ఆందోళన
- సభలో వీటిపై మోడీ మౌనం వీడాల్సిందేనని డిమాండ్



వర్చువల్ సమావేశంలో ఖర్గే, సోనియా, రాహుల్, ఎంఎ బేబీ, ఒమర్ అబ్దుల్లా, హేమంత్ సోరెన్, శరద్ పవార్, డి రాజా తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రపంచంలోని మారుమూల దేశాలను సైతం చుట్టివస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ వర్షాకాల సమావేశాల్లోనైనా సభకు హాజరై ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాలని 'ఇండియా బ్లాక్' విజ్ఞప్తి చేసింది. దేశంలోని 140 కోట్ల ప్రజల గళంగా 'ఇండియా బ్లాక్' సభ్యులు పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయా పార్టీల నేతలు నిర్ణయించారు. ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేసే రీతిలో అమల్లోకి తెస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు, మహిళలు, దళితులు, మైనార్టీలపై పెరుగుతున్న దాడులు, తదితర 8 అంశాలపై పార్లమెంటు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని తీర్మానించారు. ఈ అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడాల్సిందేనని డిమాండ్ చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు ఇండియా బ్లాక్ పార్టీల నేతల సమావేశం జరిగింది. వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశంలో 24 పార్టీల నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ (జెఎంఎం), శరద్ పవార్ (ఎన్‌సిపి), ఉద్ధవ్ ఠాక్రే, సంజయ్ రౌత్ (శివసేన), సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ, ఆ పార్టీ ఎంపి జాన్ బ్రిట్టాస్, సిపిఐ ప్రధానకార్యదర్శి డి రాజా, అలాగే దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ ఎంఎల్), అభిషేక్ బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), తేజస్వి యాదవ్ (ఆర్‌జెడి), రామ్‌గోపాల్ యాదవ్ (ఎస్‌పి), తిరుచ్చి శివ (డిఎంకె), జి దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), పికె కున్హాలికుట్టి (ఐయుఎంఎల్), తిరుమావలవన్ (విసికె), ఎన్‌కె ప్రేమచంద్రన్ (ఆర్‌ఎస్‌పి), జోస్ కె మణి (కేరళ కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం కాంగ్రెస్ రాజ్యసభ ఉపనేత ప్రమోద్ తివారీ మాట్లాడుతూ.. ప్రతిపక్షాల ఇండియా బ్లాక్ నేతల వర్చువల్ సమావేశం విజయవంతంగా, స్నేహపూర్వకంగా జరిగిందని అన్నారు. త్వరలో ఇండియా బ్లాక్ నేతల సమావేశం ఫిజికల్‌గా జరుగుతుందని, 140 కోట్ల మంది ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. ప్రధాని మోడీ విదేశాలకు వెళ్లడం కంటే, పార్లమెంటుకు హాజరుకావడం ముఖ్యమని ప్రతిపక్షాలు భావిస్తున్నాయని అన్నారు. పహల్గామ్ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సమావేశం భావించిందన్నారు. ఇండియా, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తానే చేయించానని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చేసిన పదేపదే ప్రకటనలపై ప్రభుత్వం మౌనం దాల్చడం పట్ల ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. దేశ విదేశాంగ విధానంపై ఇండియా బ్లాక్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారని, దేశంలోని ప్రతి ఒక్కరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జవాబుదారీగా ఉండాలని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, ఎస్‌సి, ఎస్‌టి, మహిళలు, మైనార్టీలపై దౌర్జన్యాలపై కొంత మంది సభ్యులు లేవనెత్తారని అన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీసేందుకు ఇసి చర్యలు

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, రాజ్యసభ పక్ష నేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రవాద దాడి వెనుక ఉన్న భద్రతా లోపాలను ఖండించారు. బీహార్ ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు, దీనివల్ల ప్రజలు ఓటు హక్కును ముప్పు కలుగుతుందని విమర్శించారు. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ, బెంగాలీ మాట్లాడేవారిపై దాడులు వంటి అనేక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేయాలని సమావేశం నిర్ణయించిందన్నారు. దీనితో పాటు, ప్రతిపక్షాలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, రాష్ట్రాలపై దాడులు వంటి అంశాలను కూడా బలంగా లేవనెత్తుతాయని అన్నారు. ఇండియా బ్లాక్ నాయకులు ఐక్యంగా ఉండి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారన్నారు. బీహార్‌లో ఓటు హక్కు తిరస్కరణకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ నేతలు, ఎంపిలు పార్లమెంట్ వెలుపల జాతీయ స్థాయిలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఆగస్టు ప్రారంభంలో ఇండియా బ్లాక్ నేతలు నేరుగా సమావేశమవుతారని అన్నారు. దేశ ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీసేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. ఒకవైపు, ఓటర్లను సామూహికంగా ఓటర్ల జాబితా నుండి తొలగిస్తుండగా, మరోవైపు, సంఘ్ పరివార్ సూచించిన వ్యక్తులను నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓటరు జాబితాలో చేర్చుతున్నారని దుయ్యబట్టారు. దీనికోసం బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు ఇది ఉద్దేశపూర్వక చర్య అని అన్నారు.

పార్లమెంటులో లేవనెత్తే 8 అంశాలు

దేశంలో సామాజిక, రాజకీయ అంశాలపై విస్తృతంగా చర్చించిన ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తాల్సిన 8 ప్రధాన అంశాలపై తీర్మానం చేశారు. అవి..

- పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి సంబంధించి ప్రభుత్వ వైఫల్యంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం.
- ఆపరేషన్ సిందూర్‌ను ఆకస్మికంగా నిలిపివేయడం వెనుక గల కారణాలు ఏంటి?
- కాల్పుల విరమణ, వాణిజ్యంపై డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరడం.
- బీహార్‌లో ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న ఓటుబ్యాంకు రాజకీయాలపై నిలదీయడం
- పాకిస్తాన్, చైనా, గాజా వంటి అంశాలపై ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని ప్రశ్నించడం.
- డీలిమిటేషన్ ప్రక్రియ, దాని ప్రభావాలపై చర్చ.
- దేశంలో దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ ప్రజలపై జరుగుతున్న అఘాయిత్యాల సమస్యలను లేవనెత్తడం.
- అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రభుత్వం నుంచి సమాధానం కోరడం.
- న్యాయమూర్తుల యశ్వంత్ వర్మ, శేఖర్ యాదవ్ కేసులను కూడా లేవనెత్తే.

సౌదీ 'స్లీపింగ్ ప్రిన్స్' మృతి

దుబారు : ఓ కారు ప్రమాదంలో గాయపడి దాదాపు 20 ఏళ్లుగా కోమాలో ఉన్న సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ ఖలీద్ బిన్ (36) మృతి చెందారు. ఈ విషయాన్ని గ్లోబల్ ఇమామ్స్ కౌన్సిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సుదీర్ఘ పోరాటం తర్వాత ఆయన శనివారం నాడు కన్నుమూశారని పేర్కొంది. అల్ వలీద్ తండ్రి ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ కూడా ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ధ్రువీకరించారు. సుదీర్ఘకాలం కోమాలో ఉండటంతో ఆయన 'స్లీపింగ్ ప్రిన్స్'గా ప్రాచుర్యం పొందారు.

FORM NO.14
{See Regulation 33(2)}
OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
R.P. No.644 of 2024 in OA No.463 of 2019
Canara Bank (e-Syndicate Bank), Gandhinagar Branch, Vijayawada
Versus
Sri Debasish Pal & another

To
(CD-1) **Sri Debasish Pal, S/o SR Pal,** Sr. Loco Pilot, SC Railway, R/o D.No.B/52, Navabharat Apartments, Ayodhya Nagar, Vijayawada.
Also
Present Residence of **Debasish Pal, S/o SR Pal,** Ex-LP Goods/ Railway, Yellaji's Street, Alcot Gardens, Rajahmundry-101.
(CD-2) **Gonnabathula Meher Babu, S/o Rama Rao,** Loco Pilot, SC Railway, R/o D.No.21-10/8-6, 4th Line end, Srinivasa Nagar, Vijayawada.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/463/2019** an amount of **Rs.13,31,615.97 Ps (Rupees Thirteen Lakhs Thirty One Thousand Six Hundred Hundred Fifteen and Ninety Seven Paise Only)** together with future interest @16.05% per annum with compounded monthly rests w.e.f. 22/05/2019 till realization and costs has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **27/08/2025 at 10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
   (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
   (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.

(Given under my hand and the seal of the Tribunal, on this date 19/03/2025
(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

బ్రిటన్‌లో 23 నుంచి మోడీ పర్యటన

- విదేశాంగశాఖ వెల్లడి

న్యూఢిల్లీ : పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమై అవ్వగానే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశాల బాట పట్టనున్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు ఆయన బ్రిటన్, మాల్దీవుల్లో పర్యటించనున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. గత మే 6న ప్రకటించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా కార్యరూపం దాల్చనున్నట్లు తెలిపింది. ఈ పర్యటనలో బ్రిటన్ ప్రధానమంత్రి కెయిర్ స్టార్మర్‌తో మోడీ వివిధ అంశాలపై చర్చలు జరుపుతారని పేర్కొంది. అలాగే కింగ్ చార్లెస్ 3తో కూడా మోడీ సమావేశమవుతారని విదేశాంగ శాఖ తెలిపింది. కాగా మాల్దీవుల్లో కూడా మోడీ పర్యటించనున్నారు. మాల్దీవులు అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మూయిజ్ ఆహ్వానం మేరకు ఈ నెల 25, 26 తేదీల్లో పర్యటించనున్నారు. ఈ నెల 26న జరిగే మాల్దీవులు 60వ స్వతంత్ర దినోత్సవానికి గౌరవ అతిథిగా మోడీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నేతలు ఆర్థిక, మారిటైం, భద్రత భాగస్వామ్యం తదితర అంశాలపై కూలంకషంగా చర్చించనున్నారని విదేశాంగ శాఖ తెలిపింది.

ఇండోనేషియాలో అగ్నికీలల్లో ఫెర్రీ

- ఐదుగురి మృతి

జకర్తా : ఇండోనేసియాలో వందలాది మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఫెర్రీలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సులవేసి ద్వీపం వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఓ గర్భిణీ ఉన్నట్లు గుర్తించారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బందాలు.. ఇప్పటివరకు 280 మందిని రక్షించినట్లు సమాచారం. తలౌడ్ నుంచి ఉత్తర సులవేసి ప్రావిన్సు రాజధాని మనాడోకు 'కేఎం బార్సిలోనా 5' ఫెర్రీ బయలుదేరింది. తలిసే ప్రాంతానికి చేరుకున్న సమయంలో ఫెర్రీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ నీటిలో దూకారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

రష్యాలో భూకంపం..

- సునామీ హెచ్చరికలు జారీ

మాస్కో : రష్యా తీరంలో ఆదివారం ఉదయం మూడు సార్లు భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయని అమెరికా జియోలాజికల్ సర్వే సంస్థ పేర్కొంది. కంపన తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదైనట్లు తెలిపింది. రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పానికి, హవాయిలోని కొన్ని ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. కమ్చట్కా రాజధాని పెట్రోపావ్లోవ్స్ -కమ్చట్స్కీ నగరానికి తూర్పున 144 కిలో మీటర్ల దూరంలో 20 కిలో మీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. గంట సమయంలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 1,80,000 మంది జనాభా ఉన్నట్లు సమాచారం. అయితే ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. ముందు జాగ్రత్తగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచనలు చేశారు.

వియత్నాంలో బోటు బోల్తా

- 37 మంది పర్యాటకులు మృతి

హనోయి : వియత్నాంలో ఘోర ప్రమాదం జరిగింది. పర్యాటకుల బోటు బోల్తా పడటంతో 37 మంది మరణించినట్లు స్థానిక మీడియా ఆదివారం వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం .. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఉత్తర వియత్నాంలోని క్వాంగ్ నిన్హ్ ప్రావిన్స్‌లోని హాలాంగ్ బే వెళుతుండగా అకస్మాత్తుగా ఉరుములతో భారీ వర్షం కురిసింది. దీంతో బోటు బోల్తాపడినట్లు వియత్నాం మీడియా తెలిపింది. ఆ సమయంలో బోటులో 48 పర్యాటకులతో పాటు ఐదుగురు సిబ్బంది ఉన్నారు. 47 మందిలో పది మందిని రక్షించగా, 37 మంది మరణించినట్లు తెలిపింది. మృతుల్లో 20 మందికి పైగా చిన్నారులు ఉన్నట్లు పేర్కొంది. నలుగురు బాధితులను గుర్తించాల్సి వుందని తెలిపింది.

అమెరికాకు పెరిగిన చైనా అయస్కాంత ఎగుమతులు

బీజింగ్ : అమెరికాకు చైనాలో ఉత్పత్తి అయ్యే అరుదైన భూఅయస్కాంత ఖనిజాల ఎగుమతులు పెరిగాయి. మేతో పోలిస్తే జూన్‌లో ఈ పెరుగుదల ఏడు రెట్ల కంటే అధికంగా నమోదైందని చైనా కస్టమ్స్ గణాంకాలు చెప్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. చైనాపై భారీ సుంకాలు విధించారు. దీంతో అమెరికాలో ఈ కీలక ఖనిజాల కొరత ఏర్పడి అక్కడి వాహన పరిశ్రమ పైనా ప్రభావం చూపింది. చైనా నుంచి ఏప్రిల్, మేలలో తగ్గిన ఈ ఖనిజాల ఎగుమతులు.. జూన్‌లో పెరిగాయి. ఈ కీలక అయస్కాంత ఖనిజాలను ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో భూఅయస్కాంతాల ఎగుమతిలో 90 శాతానికి పైగా చైనా నుంచే జరుగుతుంది.

ఉదారవాద విధానాలతో అసమానతలు తీవ్రం

- డివైఎఫ్ఐ జాతీయ సదస్సులో ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమల్జేస్తున్న నయా ఉదారవాద విధానాల ఫలితంగా దేశంలో నిరుద్యోగం, అసమానతలు తీవ్రమవుతున్నాయని ప్రముఖ ఆర్థిక వేత్త, ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ.. దేశంలో కార్మిక ఉత్పాదకత, వృద్ధి రేటు పెరిగిందని చెప్పగలిగినప్పటికీ, వేతనాలు, ఉపాధి దామాషా ప్రకారం పెరగలేదని అన్నారు. పని హక్కు ప్రాథమిక హక్కుల్లో భాగం కావాలన్నారు. ఒక వ్యక్తికి ఉద్యోగం లభించడంలో సామాజిక పరిస్థితులు పెద్ద పాత్ర పోషిస్తాయని, నిరుద్యోగ సమస్యపై డివైఎఫ్ఐ లేవనెత్తుతున్న పోరాటాలు స్వాగతించదగినవని ప్రభాత్ పట్నాయక్ అన్నారు. ఫాసిస్ట్, నయా ఫాసిస్ట్ ప్రభుత్వాలు ఉన్న అన్ని దేశాల్లో నిరుద్యోగ రేటు పెరుగుతోందన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం,

దేశంలో ప్రజల మధ్య చిచ్చురాజేస్తున్న సంఘ్ పరివార్ వంటి శక్తులకు వ్యతిరేకంగా యువత ఐక్యంగా పోరాడాలని సిపిఎం పూర్వ ప్రధానకార్యదర్శి ప్రకాశ్ కరత్ పిలుపునిచ్చారు. గత కొన్నేళ్లుగా దేశంలో ప్రజలను విభజించే ప్రయత్నాలు తీవ్రమవుతున్నాయని, యువతను సంఘటితం చేయడంతో అలాంటి ప్రయత్నాలను ప్రతిఘటించాలని ఆయన సూచించారు. రాజ్యసభ ఎంపి, డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఎఎ రహీం మాట్లాడుతూ.. అధిక పని ఒత్తిడి కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఎర్నాకుళానికి చెందిన అన్నా సెబాస్టియన్, బెంగళూరులోని ఓలా కంపెనీ ఎఐ విభాగంలో పనిచేసిన నిఖిల్ సోమవంశీ ఆత్మహత్యలకు న్యాయం చేయడంలో బిజెపి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడాన్ని విమర్శించారు. ఈ సదస్సులో అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, సిఐటియు అఖిలభారత కార్యదర్శి ఎఆర్ సింధు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తదితరులు ప్రతినిధులనుద్దేశించి ప్రసంగించారు. డివైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం సాజి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న తదితరులు పాల్గొన్నారు.

FORM NO.14
{See Regulation 33(2)}
OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
RC/475/2024 **17.06.2025**
Canara Bank (e-Syndicate Bank), Siddartha Medical College Branch, Vijayawada, Krishna District
Versus
M/s Sai Balaji Foods and Beverages Pvt. Ltd., & others

To
(CD-1) **M/s. Sai Balaji Foods and Beverages Pvt. Ltd., rep. by its Managing Director Sri. Putti Srinivasa Rao,** Venkata Heights Ashram Road, Patamata Lanka, Vijayawada, Krishna District-520014.
(CD-2) **Sri. Putti Srinivasa Rao, S/o Sri. Madhu Sudhana Rao,** Venkata Heights Ashram Road, Patamata Lanka, Vijayawada, Krishna District-520014.
(CD-3) **Sri. Kolusu Giri Raju, S/o Sri. Raju,** Sri Nilayam Apartments, Patamata Lanka, Vijayawada, krishna District-520014.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/521/2020** an amount of **Rs.3,06,07,278.65/- (Rupees Three Crores Six Lakhs Seven Thousand Two Hundred Seventy Eight and Sixty Five Paise Only)** minus **Rs.1,92,35,000/-** (realized by sale of schedule mentioned property by bank as per Part Satisfaction recorded on 27.03.2024) along with pendentellite and future interest @12.75% p.a compounded with monthly rests from the date of application i.e. 13.07.2020 till realization / date of payment and the costs has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. In addition to the sum aforesaid you will be liable to pay :
   (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
   (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
5. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below :

16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16(2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 17th June 2025)
(Avasarala Anil) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

ఈక్వెడార్‌లో మైనింగ్ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళనలు

- భూమి, ఉపాధి పోతుందని రైతుల ఆందోళన
- దీనిలో ప్రభుత్వ పెద్దల హస్తం

క్వీటో : దక్షిణ అమెరికా దేశమైన ఈక్వెడార్‌లోని లాస్ నావేస్‌లో రైతులు మైనింగ్ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ గత వారం నుండి ఆందోళనలు చేస్తున్నారు. దీని వల్ల తమ జీవనోపాధి పోతుందని, నీటి వనరులు కోల్పోతామని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాజెక్ట్ చేపట్టిన సంస్థ దేశాధ్యక్షుడు డానియల్ నొబోవా కుటుంబ సభ్యులకు చెందిందని అందుకే నిరసనలను అణిచేస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. లాస్ నావేస్ ప్రాంతంలో బంగారం, వెండి, జింక్ వంటి విలువైన ఖనిజాలను గుర్తించారు. దీన్ని ఎల్ డోమో గని అంటారు. వీటిని వెలికితీసే ప్రాజెక్ట్‌ను క్యూరీమైనింగ్ సంస్థ చేపట్టింది. అయితే దీని వల్ల తమ వ్యవసాయం, పసుసంపద, నీటి వనరులు దెబ్బతింటాయని రైతులు, గ్రామీణ ప్రజలు గతకొంతకాలంగా ఉద్యమిస్తున్నారు. శనివారం నాడు స్థానికులకు పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. నొబోవా ప్రభుత్వం నిరసనకారుల శిబిరాలను తొలగించిందని, వందలాది మందిని అరెస్ట్ చేసిందని, అనేకమంది గాయపడ్డారని ఆదేశ మీడియా వెల్లడించింది. రాజకీయ విశ్లేషకురాలు, వామపక్ష కార్యకర్త అయిన పామెలా విటెరీ ఈగని ప్రాజెక్ట్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, దీని వెనకాల ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని, పోలీసుల ద్వారా నిరసనలను అణిచేసి వనరులు దోచుకోవడానికి కంపెని చూస్తుందని విమర్శించారు. మౌనంగా ఉంటే కార్పోరేట్ కంపెనీలు దేశాన్ని దోచుకుంటాయని, ఈ పోరాటం ఇక్కడికే పరిమితం కాదని పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాలని పిలునిచ్చారు.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Home Finance | **నమోదిత కార్యాలయం :** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (తూర్పు), ముంబై-400051
కార్పొరేట్ కార్యాలయం : ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి తూర్పు, ముంబై-400059
శాఖా కార్యాలయం : 54-20-1బి, యూనిట్ నం.4, మూడవ అంతస్తు, సూర్య ప్రకాష్ స్క్వేర్, గురునానాక్ కాలనీ, రెవెన్యూ వార్డు నం.2, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007.

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువసంతకందారు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర సం	రుణగ్రహీత/ సహ రుణగ్రహీల పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం(రూ.)	శాఖ పేరు
1.	మద్దాల అశ్విని కుమార్ (రుణగ్రహీత), మద్దాల అశ్విని (సహ రుణగ్రహీత)/ LHVJW00001396020	ఆంధ్రప్రదేశ్-521311, మచిలీపట్నం, మచిలీపట్నం అంబేద్కర్ నగర్, బలరాంపేట వద్ద ఎసిసి ఇంటి డో.నం.9/340, డో.నం.9/3135, వార్డు నం.9 మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ కొలత 147 చ.గ.లు. లేదా 123.19 చ.మీ.లు. హద్దులు : ఉత్తరం : ఇ.కోటేశ్వరరావు ఆస్తి 38.9, దక్షినం: మార్గం మరియు ఇతరుల ఆస్తి, తూర్పు : ఉస వెంకటేశ్వరరావు ఆస్తి 35, పడమర : జి.పాపయ్య ఆస్తి 35.6/ స్వాధీనతా తేది : 15.07.2025	23-04-2025 Rs. 7,53,342/-	విజయవాడ

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును
తేది : 21 జులై, 2025, ప్రదేశం : మచిలీపట్నం **అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

మలేరియా నివారణకు ఐసిఎంఆర్ కొత్త వ్యాక్సిన్

న్యూఢిల్లీ : మలేరియా నివారణకు కొత్త వ్యాక్సిన్ రూపొందించినట్లు భారత వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్) తెలిపింది. భువనేశ్వర్‌లోని ఐసిఎంఆర్ ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం, జాతీయ మలేరియా పరిశోధన సంస్థ, జాతీయ రోగనిరోధక శాస్త్రాల సంస్థ భాగస్వామ్యంతో ఈ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొంది. అడ్‌ఫాల్సీవాక్స్ అనేది మలేరియాను కలిగించే ప్లాస్మోడియం పరాన్నజీవి రక్తంలో ఉన్న రెండు క్లిష్టమైన దశలను లక్ష్యంగా చేసుకోవడానికి రూపొందించిన మొట్టమొదటి చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్ అని ఆ సంస్థ పేర్కొంది. ఈ వ్యాక్సిన్ మానవులను మలేరియా సంక్రమణ నుంచి రక్షించడమే కాకుండా.. వ్యాధి వ్యాప్తిని తగ్గిస్తున్నట్లు గుర్తించామని తెలిపింది. ప్రీక్లినికల్ దశలో మంచి ఫలితాలొచ్చాయని, ఇప్పటికే ఉన్న సింగిల్-స్టేజ్ వ్యాక్సిన్‌ల కంటే అడ్‌ఫాల్సీవాక్స్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని ఐసిఎంఆర్ పేర్కొంది.

డెల్టా ఎయిర్‌లైన్ ఇంజిన్‌లో మంటలు..

లాస్‌ఏంజెలెస్ : విమానం గాల్లో ఉండగానే ఇంజిన్‌లో మంటలు చెలరేగిన ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. ఈ నెల 18న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఆ వివరాల ప్రకారం..డెల్టా ఎయిర్‌లైన్‌కు చెందిన బోయింగ్ 767-400 విమానం లాస్‌ఏంజెలెస్ నుంచి అట్లాంటాకు బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే సమస్య ఎదురైంది. ఎడమవైపు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఎయిర్‌పోర్టు సిబ్బందికి సమాచారం ఇచ్చి.. విమానాన్ని వెనక్కి మళ్లించారు. లాస్‌ఏంజెలస్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దిగింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే రన్‌వేపైకి వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది.

AXIS BANK LIMITED
రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం. 30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) "త్రిశూల్", సమర్తేశ్వర్ గుడి ఎదురు, లా వద్ద గార్డెన్, ఎలిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు :

క్ర. సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు, హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	తనఖాకు సమానంగా ఆఫర్ చేయబడిన ఆస్తులు మరియు స్వాధీనత తేది
1.	**1. శ్రీ.పొదిలి గంగాధర్, తండ్రి. పొదిలి సుబ్బారావు,** డో.నం.11-535, దాసరి కాలనీ, పురుషోత్తపట్నం, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522616. **ఇక్కడ కూడా : శ్రీ పొదిలి గంగాధర్, కేరాఫ్. శ్రీ.లక్ష్మి హోమ్ అప్లయన్సెస్,** డో.నం.8-160, కొత్త ఆర్‌టిసి బస్ స్టాండ్ ఎదురు, ఎన్‌ఆర్‌టి రోడ్డు, కారంపుడి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522614. **2. శ్రీమతి. పొదిలి నాగ దుర్గ, భర్త. పొదిలి గంగాధర్,** డో.నం.11-535, దాసరి కాలనీ, పురుషోత్త పట్నం, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616. **ఇక్కడ కూడా : శ్రీమతి. పొదిలి నాగ దుర్గా, కేరాఫ్. దుర్గా హోమ్ అప్లయన్సెస్,** డో.నం.1-6, పాత బస్ స్టాండ్ వీధి వద్ద, కారంపుడి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522614. **డిమాండ్ నోటీసు తేది :** 19.03.2025 **లోన్ అకౌంట్ నెం.: PHR006907716992**	రూ. 32,84,637/- (ముప్పై రెండు లక్షల ఎనభై నాలుగు వేల ఆరు వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే)	నరసరావుపేట రిజిస్టర్డ్ జిల్లా, పిడుగురాళ్ల ఉపజిల్లా, గుంటూరు జిల్లా, కారంపుడి మండలం, పేటసన్నెగండ్ల గ్రామ పంచాయతీ పరిధి, పేటసన్నెగండ్ల రెవెన్యూ గ్రామం, ప్లాట్ నం.08, నరసరావుపేట రెవెన్యూ గ్రామం, డో.నం.644/2, మూల్యాంకనం నం.1615, ఇంటి నం.7-208 విస్తీర్ణం 173.33 చ.గ.లు. రెసిడెన్షియల్ ఆర్‌సిసి రూఫ్డ్ గ్రౌండ్ 1176 చ.అ.లు. పూర్తయిన ఆర్‌సిసి భవనం మరియు దీని ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు ఉన్న **హద్దులు : తూర్పు:** 30 అ.లు. వెడల్పు బజారు 26 అ.లు., **దక్షిణం :** పమ్మి శ్రీనివాసరెడ్డి ఇల్లు, ప్లాట్ నం.17- 60 అ.లు., **పడమర :** దేరంగుల వెంకటేష్ సైట్ 26 అ.లు., **ఉత్తరం :** ఎక్కంటి పిచ్చారెడ్డి సైట్, ప్లాట్ నం.09- 60 అ.లు. పై సరిహద్దుల ఆ ఆర్‌సిసి డాబాలో సైట్ పరిధి 173.33 చ.గ.లు. మరియు అన్నీ ఇతర ఉపకరణాలు మొదలైనవి. లాంచనప్రాయ స్వాధీనత : **16.07.2025**

తేది : 21.07.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

జీవన సౌరభం

జీవితంలో ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

మీ కోసం

ఇంట్లో చిన్నపిల్లలు ఉన్నవారు ఇంటి ఫ్లోర్‌ను ముందుగా వేడినీళ్లతో శుభ్రం చేయాలి. తర్వాత నూలు వస్త్రంతో లేదా స్పాంజ్‌తో తుడవాలి. అప్పడే క్రిములు తొలగి రోగాలు రావు.

సాయం అవసరం

ఒక ఊరి బయట చిట్టడవిలో ఒక పంది తన నాలుగు చిన్న పిల్లలతో నివసిస్తోంది. పంది నివాసానికి దగ్గరలో పొదలలో ఒక ముసలి ఎలుగుబంటి ఉంది. పంది రోజూ ఆహారాన్ని తెచ్చి తన పిల్లలకు పెడుతుంది. కొంచెం ఆహారాన్ని ఎలుగుబంటికి కూడా ఇస్తుంది. అది పిల్లలకు నచ్చేది కాదు. వద్దని చెప్పేవారు. అయినా తల్లి పంది ఎలుగుబంటికి ఆహారం పెడుతుంది.

పంది నివాసానికి దగ్గరలో ఒక నుయ్యి ఉంది. ఒకరోజు పంది ఆహారం కోసం వెళుతూ నూతి వద్దకు వెళ్లొద్దని పిల్లలకు జాగ్రత్తలు చెప్పి వెళ్ళింది. మూడు పంది పిల్లలు తల్లి మాటలు విని నూతి వద్దకు వెళ్లలేదు. కానీ నాలుగో పందిపిల్ల నూతి వద్దకు వెళ్ళింది. దాంట్లోకి తొంగి చూసింది. తన రూపమే అందులో మరో పంది పిల్లలా కనబడింది. ఆ పందిపిల్లతో మాట్లాడాలని నూతిలోకి దూకింది. నీళ్లలో మునిగిపోతూ సహాయం కోసం అరవసాగింది. అది గమనించిన నూతి బయట ఉన్న మూడు పంది పిల్లలు కూడా సహాయం కోసం అరిచాయి.

అరుపులు విన్న ముసలి ఎలుగుబంటి అక్కడికి వచ్చింది. తన శక్తినంతా కూడగట్టుకుని ఒక వెడల్పాటి కర్రను తీసుకొచ్చి నూతిలోకి దింపింది. ఆ కర్ర మీదుగా ఎక్కి పందిపిల్ల నూతి నుండి బయటకు వచ్చింది.

కొంచెం సమయం తర్వాత ఆహారం కోసం బయటకు వెళ్ళిన పంది తిరిగి వచ్చింది. విషయం తెలుసుకుంది. తన మాట వినకుండా నూతి వద్దకు వెళ్లి నూతిలో పడి ప్రాణం మీదకు తెచ్చుకున్న పిల్లని మందలించింది.

'బుద్ధొచ్చిందమ్మా, ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించను. నువ్వు చెప్పిన మాట వింటాను' అంది ఆ పిల్ల. మిగిలిన పిల్లలు కూడా 'అమ్మా, ఎవరికైనా సాయం అవసరం ఉంటుందని ఈరోజు మాకు తెలిసిందమ్మా. ఇంకెప్పుడూ నీకు ఎదురు చెప్పం. ఎవరికైనా సాయం చేస్తుంటే వద్దు అనం' అన్నాయి. విషయం తెలుసుకున్న తల్లి పంది, తన పిల్లని రక్షించినందుకు ఎలుగుబంటికి ధన్యవాదాలు తెలిపింది.

– కళ్ళేపల్లి తిరుమలరావు,
తెలుగు ఉపాధ్యాయుడు,
కృష్ణాజిల్లా,
91770 74280.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ

అక్షౌహిణి,
5వ తరగతి,
విద్యాధరి హైస్కూల్,
గోపాలపురం,
హనుమకొండ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పెరటి మొక్కలను ఇలా పెంచుదాం..

వర్షాకాలం ప్రకృతి ప్రేమికులకు గొప్ప కాలం. ఈ కాలంలో మొక్కలు వేగంగా పెరుగుతాయి. వేర్లు బలంగా కుదురుకుంటాయి. కొత్త మొక్కలు నాటాలన్నా, ఉన్న మొక్కలు సంరక్షించుకోవాలన్నా ఈ కాలం ఎంతో అనువైనది. తాజా ఆకుకూరలు, కాయగూరల మొక్కలే కాదు, ఆయుర్వేద మొక్కలను కూడా ఇంటి ప్రాంగణంలోనే పెంచుకోవచ్చు.

తులసి : రోగనిరోధక శక్తిని పెంచి, శ్వాసకోశ వ్యవస్థని శుభ్రపరుస్తుంది. ఈ కాలం వేగంగా పెరుగుతుంది.

ఎలా పెంచాలంటే..

- నేల పొడిగా ఉన్నప్పుడే నీరు పెట్టాలి.
- చిన్న కుండీలు, ప్లాస్టిక్ డబ్బాల వంటి వాటిల్లో కూడా పెంచుకోవచ్చు.
- పొడిగా ఉన్న మట్టి, కొంచెం కంపోస్ట్, కొద్దిగా ఇసుక ఉంటే చాలు, తులసి మొక్క నాటుకోవచ్చు.
- నీరు బయటికి వెళ్లే మార్గం కచ్చితంగా ఉండాలి.
- పువ్వులను ఎప్పటికప్పుడు తుంచేస్తేనే, ఆకులు బాగా పెరుగుతాయి.
- వర్షంలో తడిచేలా ఆరుబయట పెట్టకూడదు. ఒకవేళ ఉన్నా, ఎప్పటికప్పుడు వర్షపునీరు బయటికి వెళ్లే మార్గం చేయాలి.

పుదీనా : జీర్ణక్రియకి బాగా ఉపయోగపడుతుంది. వేడినీళ్ల కషాయం, చట్నీలు, సలాడ్లలో విరివిగా ఉపయోగించవచ్చు. ఈ కాలం చాలా త్వరగా పెరుగుతుంది. సులభంగా వ్యాపిస్తుంది.

ఎలా పెంచాలంటే..

- పుదీనా మొక్క పెట్టిన కుండీని ఉదయం ఎండ తగిలే చోట, ఆ తరువాత నీడ వచ్చే ప్రదేశంలో పెట్టుకోవాలి.
- పక్కలకు వ్యాపించే గుణం ఉంది కాబట్టి, విశాలంగా ఉండే కుండలను ఉపయోగించాలి.
- తేమగా ఉన్న చోట నాటినా కొత్త మొక్కలు పెరుగుతాయి.
- దళసరిగా పెరగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి.
- శిలీంద్రాల పెరుగుదలను నివారించేందుకు పసుపుపచ్చగా మారిన ఆకులను ఎప్పటికప్పుడు తొలగించాలి.

కొత్తిమీర.. అనేక రకాల వంటకాలకు అదనపు రుచిని జోడించే కొత్తిమీర పెద్దగా సంరక్షణ చేయకుండానే పెరుగుతుంది. ఈ ఆకులు జీర్ణ సంబంధ సమస్యలను నివారిస్తాయి.

ఎలా పెంచాలంటే..

- నాటే ముందు కొత్తిమీర విత్తనాలను తేలికగా దంచుకోవాలి.
- సారవంతమైన మట్టిలో విత్తుకోవాలి.
- తేలికగా నీటిని చల్లి, సూర్యకాంతి పడేలా ఉంచాలి.
- నేల పొడిబారకుండా నీళ్లను చల్లుతూ ఉండాలి. అయితే నీరు ఎక్కువ పోయకూడదు.
- మొక్కలు పెరిగాక, నాలుగు నుండి ఆరు అంగుళాల ఎత్తు వచ్చిన తరువాతే ఆకులు కోయాలి. రెండు వారాలకోసారి ఫ్రెష్‌గా కొత్త విత్తనాలను నాటుకోవాలి.

నిమ్మగడ్డి : జీర్ణక్రియకి బాగా ఉపయోగపడుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. సహజ దోమల వికర్షకంగా పనిచేస్తుంది. వర్షాకాలంలో బాగా పెరుగుతుంది.

ఎలా పెంచాలంటే..

- 12 అంగుళాల లోతు ఉన్న కుండలు ఈ మొక్కలు పెరగడానికి అనువుగా ఉంటాయి.
- ఇసుక, పొడిబారిన నేలలో ఈ మొక్కలను నాటుకోవాలి.
- నెలకు ఒకసారి ద్రవరూపంలో ఉన్న ఎరువులు వేసుకోవాలి.
- ఎప్పటికప్పుడు ఎండిన, పసుపురంగులోకి మారిన ఆకులను కత్తిరించాలి.

మెంతికూర : ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. రక్తంలో చక్కెరని నియంత్రించడంలో సహాయపడతాయి. వేగంగా పెరుగుతాయి.

ఎలా పెంచాలంటే..

- తేమతో కూడిన నేలలో మెంతి విత్తనాలను నాటుకోవాలి.
- ఈ విత్తనాలను రాత్రిపూట నీళ్లల్లో నానబెట్టాలి.
- ట్రే లాంటి వాటిల్లో చల్లినా మొక్కలు వస్తాయి.
- పాక్షిక నీడ ఉన్న ప్రదేశంలో ఉంచినా ఆరోగ్యంగా పెరుగుతాయి.
- స్ప్రే బాటిల్‌తో నీళ్లు చల్లుకోవాలి.
- దట్టంగా పెరిగిన మొక్కలను పలుచగా ఉండేలా కొన్నిమొక్కలు తీసి వేరే చోట పెట్టుకోవాలి.
- 12నుండి 15రోజుల్లో ఆకులను కత్తిరించుకోవచ్చు.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా ...

వర్షాకాలంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. ఒకసారి వచ్చాయంటే ఓ పట్టాన వదిలిపోవు. చాలా అసౌకర్యాన్ని కలిగిస్తాయి. వచ్చాక జాగ్రత్తలు తీసుకోవడం కంటే రాకుండా జాగ్రత్త పడటం ముఖ్యం. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా సౌకర్యవంతంగా, ఆరోగ్యంగా ఉండేందుకు ఈ చిట్కాలు పాటించాలి.

వ్యక్తిగత పరిశుభ్రత

క్రమం తప్పకుండా స్నానం చేయాలి. తరచుగా చేతులు కడుక్కోవాలి. ప్రతిరోజూ ఉతికిన బట్టలే వేసుకోవాలి. పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచడం చాలా ముఖ్యం. పాదాలు సౌకర్యవంతంగా ఉండేలా బూట్లకు బదులుగా చెప్పులు లేదా ఓపెన్–టోడ్ బూట్లు ధరించడం మేలు. అలాగే గోళ్లను చిన్నగా శుభ్రంగా కత్తిరించుకోవాలి.

వస్త్రధారణ ఇలా..

వదులుగా ఉండే దుస్తులను ధరించాలి. స్పాండెక్స్ లేదా నైలాన్ వంటి సింథటిక్ ఫ్యాబ్రిక్‌లను ధరించకూడదు. ఈ బట్టలు శరీరానికి గాలిని తగలనివ్వవు. శరీరంపై వేడి, తేమను పట్టిఉంచుతాయి. కాబట్టి వదులైన దుస్తులే వేసుకోవాలి.

చర్మాన్ని పొడిగా ఉంచండి..

ఫంగల్ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే నివాస స్థలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అలాగే గాలిలో తేమను తగ్గించడానికి, శిలీంధ్రాల పెరుగుదలను అరికట్టడానికి ఇంటిలోని అన్ని ప్రాంతాలకు ధారాళంగా గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి.

ప్రత్యేక టవల్ ఉపయోగించండి..

తువ్వాలు లేదా దుస్తులు వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోకూడదు. ఇప్పటికే ఫంగల్ ఇన్ఫెక్షన్ సంకేతాలను చూపుతున్నట్లయితే ఇంకా జాగ్రత్త పడాలి. అలాగే లాకర్ రూమ్‌లు లేదా పబ్లిక్ పూల్స్ వంటి బహిరంగ ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవకూడదు. ఈ ప్రదేశాల్లో తరచుగా తేమ ఎక్కువగా ఉంటుంది, ఇది శిలీంధ్రాల సంతానోత్పత్తికి కారణమవుతుంది.

తగిన చికిత్స తీసుకోవాలి

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫంగల్ ఇన్ఫెక్షన్‌కు గురైతే.. తగిన చికిత్స తీసుకోవడం ముఖ్యం. తేలికపాటి ఫంగల్ ఇన్ఫెక్షన్‌లకు చికిత్స చేయడానికి ఓవర్–ది–కౌంటర్ యాంటీ ఫంగల్ క్రీమ్‌లు లేదా స్ప్రేలను ఉపయోగించవచ్చు. తీవ్రమైన ఇన్ఫెక్షన్ బారిన పడితే మాత్రం వైద్యుడిని సంప్రదించాలి.

సపోటాతో ఆరోగ్య ప్రయోజనాలు

ఈకాలంలో దొరికే పండ్లలో సపోటా ఒకటి. ఎంతో తియ్యగా ఉండే సపోటాల్లో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని వైద్యులు అంటున్నారు. నీరు శాతం కూడా ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ చెమట పట్టేవారు వీటిని తీసుకుంటే నీరసం తగ్గి శక్తి పొందుతారు. వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.

- ఎముకలను బలపరిచే కాల్షియం, ఫాస్పరస్, ఐరన్ కూడా సపోటాలో పుష్కలంగా ఉన్నాయి. దాంతో రక్తహీనత తగ్గుతుంది.
- సపోటాల్లో ఉన్న ఫోలేట్స్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్, కాపర్, ఫాస్పరస్, సెలెనియం ఎముకలను దృఢంగా చేస్తాయి.
- వీటిలో ఉండే విటమిన్ ఎ, బి, ఇ చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి. విటమిన్ ఎ ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ నుంచి రక్షిస్తుంది. కంటి చూపు మెరుగుపడేలా చేస్తుంది.
- సపోటాలో డైటరీ ఫైబర్ ఉంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వీటిలో సుక్రోజ్ ఎక్కువ. బరువు తగ్గాలనుకునే వారు వీటిని తీసుకుంటే మంచిది. వీటిని తిన్న వెంటనే శరీరానికి అధికశక్తి అందుతుంది. అధిక వేడి వల్ల అలిసిపోయిన వారు సపోటా జ్యూస్ తాగితే వెంటనే శక్తి వస్తుంది.
- సపోటాల్లోని మెగ్నీషియం రక్త నాళాల్ని చురుగ్గా చేస్తుంది. అలాగే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.

యువత భావోద్వేగాలకు ప్రతిరూపం 'ఎఐఆర్'

ఊహల పల్లకీ ఎక్కి, కలల లోకంలో విహరించడం, మేఘాల్లో తేలిపోవడం చాలా తేలికైన విషయాలు. ఖర్చు లేని సరదాలు. కానీ ఆ పల్లకీని కిందకు దించి, తన కలల్ని మరొకరికి చూపించి, వాళ్ల కళ్ల ముందు కొత్త లోకాన్ని ఆవిష్కరించడమే 'సినిమా'. సినిమా అంటే గ్రాఫిక్స్ మాయాజాలమో, గగుర్పాటు కలిగించే విన్యాసాల సమాహారమో కాదు. బలమైన మాధ్యమం. విశ్వశ్రేయస్సును కోరుకునే దృశ్య కావ్యం. సాహిత్యానికి వర్తించే విలువలే చలనచిత్రానికీ వర్తిస్తాయి. వినోదంతో పాటూ వికాసాన్నీ అందించాలి. వర్తమానమనే తెరమీద, గతాన్ని గుర్తుచేసి, భవిష్యత్తు దిశగా ప్రేక్షకులతో అడుగులేయిస్తుంది. నిద్రలో ఉన్నవారిని తట్టిలేపినట్టు, నిద్రాణమైన శక్తిసామర్థ్యాల్ని గుర్తుచేస్తుంది. ఇలాంటి విషయాలను ప్రోదుచేసుకుని తీసిన వెబ్ సిరీస్ 'ఆలిండియా ర్యాంకర్స్ (ఎఐఆర్)'. ఇందులోని ఇతివృత్తం మొత్తం యుక్తవయసులోని యువతీయువకుల భావోద్వేగాలను పట్టిచూపుతుంది.



టీనేజ్‌లోకి అడుగుపెట్టగానే రెక్కలు విప్పుకొని సీతాకోకచిలుకలా స్వేచ్ఛగా ఎగిరిపోవాలనిపిస్తుంది. సొంత నిర్ణయాలు తీసుకోగలమనీ, వ్యక్తిగత స్వేచ్ఛ అవసరమనీ... గట్టిగా అరిచి చెప్పాలనిపిస్తుంది. మరోపక్క హార్మోన్ల ప్రభావంతో మనసూ, శరీరం మొరాయిస్తుంటాయి.

సరిగ్గా ఇప్పుడే అమ్మానాన్నలు పెట్టే ఆంక్షలు, సమాజం విధించే కట్టుబాట్లు కలవరపెడుతుంటాయి. అయినా సరే, ఏదో చేసేయాలన్న తపన యుక్తవయస్సు పిల్లల్లో వెంటాడుతుంటుంది. తల్లిదండ్రులు, పిల్లలు, చదువులు అనే ఈ మూడు విషయాలపై దర్శకుడు చాలా అద్భుతంగా తెరకెక్కించారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితాల చుట్టూ అల్లుకున్న కథే ఆల్ ఇండియా ర్యాంకర్స్ వెబ్‌సిరీస్. మొత్తం 7 ఎపిసోడ్లతో రూపొందిన ఈ సిరీస్ ఈనెల నుంచే సామాజిక మాధ్యమాల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

కథ సాగిందిలా...

ఈ సినిమాలో కథ 2012లో మొదలవుతుంది. అర్జున్ (హర్ష్ రోషన్), రాజు (జయతీర్థ), ఇమ్రాన్ (భానుప్రకాష్) వేర్వేరు పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేస్తారు. అప్పటికే జయశ్రీ (అక్షర) పట్ల ఆకర్షితుడైన అర్జున్, ఆమె విజయవాడలోని ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ర్యాంకర్స్ జూనియర్ కాలేజీలో చేరుతుందని తెలుసుకుని, తానూ అందులోనే చేరతాడు. ఆ తర్వాత జయశ్రీ ఆ కాలేజీలో చేరడం లేదని తెలిసిన అర్జున్, అక్కడి నుంచి బయటపడాలని నిర్ణయించుకుంటాడు. సరిగ్గా అదే సమయంలో అతనికి రాజు, ఇమ్రాన్ పరిచయమవుతారు. ఇమ్రాన్ ఉచిత సీటు కారణంగా ఆ కాలేజీలో చేరతాడు, కానీ హాస్టల్ ఫీజు కట్టుకోవడం అతనికి భారంగా మారుతుంది. మారుమూల పల్లెటూరిలో పెరిగిన ఇమ్రాన్‌కు హాస్టల్ వాతావరణం అస్సలు సరిపడదు. దాంతో, అతను కూడా అక్కడి నుంచి వెళ్లిపోవాలని భావిస్తాడు. ఇక, స్కూల్ ఎగ్గొట్టి తిరిగే రాజుకి హాస్టల్ ఒక పంజరంలా అనిపిస్తుంది. సాధ్యమైనంత త్వరగా కాలేజీ నుంచి బయటపడాలనే ఆలోచనలోనే అతను ఉంటాడు. ఇలా, ముగ్గురూ ఒక్కటి కావటంతో వారు స్నేహితులుగా మారతారు. మేనేజ్‌మెంట్ తమను కాలేజీ నుంచి పంపించేలా చేయాలని నిర్ణయించుకుంటారు. అందుకోసం వారు ఎలాంటి ప్రణాళికలు వేస్తారు? ఆ ప్రయత్నాలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయి? తమ పిల్లలు మంచి ర్యాంకులు సాధించాలని కలలు కన్న వారి తల్లిదండ్రుల కోరిక నెరవేరుతుందా? జయశ్రీతో కలిసి చదువుకోవాలనే అర్జున్ కోరిక తీరుతుందా? అనేది మిగతా కథ.

ర్యాంకుల వేటలో...పిల్లలతో ఆటలు

తమ పిల్లవాడు ఇంజనీరో, డాక్టరో అవ్వాలనీ, దానికోసం మంచి ర్యాంకులు సాధించాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అందులో తప్పులేదు. కానీ హోదా కోసమో, సమాజంలో గుర్తింపు కోసమో తాహతుకు మించి కార్పొరేట్, ప్రయివేటు కళాశాలల్లో చేర్పిస్తే ఎదురయ్యే ఆర్థికపరమైన ఇబ్బందులు ఒక్కోసారి ప్రాణంమీదకు తెస్తుంటాయి. ఉన్న బంగారం, ఆస్తులు కుదువ పెట్టి చదివిస్తున్నామనీ, మంచి ర్యాంకు రావాల్సిందేనంటూ తల్లిదండ్రులు కోరటం, కళాశాలల యాజమాన్యాలు బలవంతంగా బంధించినట్లుగా ఉంచి ఒత్తిడికి గురయ్యేలా చదివించే పరిస్థితులతో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవటం నిత్యం చూస్తూనే ఉంటాం. పెద్ద కాలేజీల్లో సెక్షన్లు చేసి, తమ కాలేజీకి ర్యాంకులు తెచ్చిపెట్టేవారిపైనే ఎక్కువ దృష్టి సారిస్తూ ఉంటాయి. ఈ మధ్యలో పిల్లలు బలిపశువులవుతుంటారు. ఈ అంశాన్ని ప్రధానంగా చేసుకుని రూపొందించినదే ఈ సిరీస్. ఓ వైపు తల్లిదండ్రులు, మరోవైపు కాలేజీ మేనేజ్‌మెంట్, ఇంకోవైపు విద్యార్థులు ఈ మూడు కోణాల నుంచి ఈ కథ ఆద్యంతం ఆసక్తికరంగా నడుస్తుంది. మొదట విద్యార్థులకు, ఆ తరువాత కాలేజీ మేనేజ్‌మెంట్‌కు, చివరగా తల్లిదండ్రులకు ప్రాధాన్యతనిస్తూ కథనం సాగుతుంది. కాలేజీ క్యాంపస్‌ను, హాస్టల్ వాతావరణాన్ని దర్శకుడు ఆవిష్కరించిన విధానం సహజత్వానికి చాలా దగ్గరగా అనిపిస్తుంది. సరదా సన్నివేశాలతో పాటు భావోద్వేగాలు కూడా బాగా పండాయి.

కథనం..సాంకేతిక విలువలు

మొత్తం 7 ఎపిసోడ్లలో మొదటి మూడు చాలా ఆసక్తికరంగా సాగుతాయి. 4-5 కాస్త నిదానంగా అనిపించినా, 6, 7 నుంచి కథ మళ్లీ వేగం పుంజుకుంటుంది. సునీల్, చైతన్యరావు, హర్ష చెముడు వంటి వారిని ప్రత్యేకమైన పాత్రలలో పరిచయం చేసిన తీరు బాగుంది. మొదటి మూడు ఎపిసోడ్‌లలో మెరిసిన డైలాగ్‌లు ఆ తరువాత లేకపోవడం ఒక లోటుగానే అనిపిస్తుంది. దర్శకుడు జోసెఫ్ క్లింటన్ అక్కడక్కడా కాస్త నెమ్మదించినప్పటికీ, కథ, కథనం విషయంలో మెప్పించాడు. టీనేజ్‌లో పిల్లల మధ్య ఉండే ఆకర్షణల గురించి చక్కగానే చూపించారు. సినిజిత్ అందించిన నేపథ్య సంగీతం సందర్భానికి తగినట్టుగా ఉంది. మనోజ్ ఫొటోగ్రఫీ బాగుందనే చెప్పాలి. శ్రీకాంత్ పట్నాయక్ ఎడిటింగ్‌కు కూడా మంచి మార్కులే వేయొచ్చు. ప్రధానమైన పాత్రలను పోషించిన ముగ్గురు యువకులు హర్ష్ రోషన్, జయతీర్థ, భానుప్రకాష్ నటనతో మెప్పించారనే చెప్పాలి. సమీర్, జీవన్, సందీప్‌రాజ్ కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. 'ఇంటర్‌లో సమ్మరే ఉంటుంది–హాలీడేస్ ఉండవు', 'లోకల్ అయినా హాస్టల్లో ఉండాల్సిందే', 'ఫీజు తగ్గితే ర్యాంక్ తగ్గుతుంది', 'ఫ్రీడమ్ కోసం పంజరాన్ని ఎంచుకోవడమంటే ఇదే', 'ఊరు దాటి బయటికొచ్చాక గెలిచే వెళ్లాలి' వంటి సంభాషణలు మనసుకు హత్తుకుంటాయి.

ముగింపు సందేశాత్మకంగా...

సరదాగా సాగిపోతూ, అక్కడక్కడా భావోద్వేగాలను స్పృశించే ఈ సిరీస్, వినోదంతో పాటు మంచి సందేశాన్ని కూడా అందిస్తుంది. విద్యార్థుల జీవితాలను, వారిపై తల్లిదండ్రుల అంచనాలను, విద్యావ్యవస్థలోని కొన్ని వాస్తవాలను ఈ సిరీస్ చక్కగా పట్టి చూపించింది. ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితాలను దగ్గరగా చూసిన వారికి, లేదా అలాంటి అనుభవాలు ఉన్నవారికి ఈ సిరీస్ బాగా హత్తుకుంటుంది. సందర్భానుసారంగా సాగిన హాస్యసన్నివేశాలు నవ్వుల జల్లులు కురిపిస్తాయి. తరచూ భావోద్వేగ సన్నివేశాలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి. మొత్తంగా చూస్తే నేటి విద్యావ్యవస్థలోని లోపాలు, కార్పొరేట్ విద్యాసంస్థల తీరు, తల్లిదండ్రుల ఆశలకు ప్రతిరూపంగా ఈ సిరిస్ సగటు ప్రేక్షకుడిని కూడా ఆకట్టుకునేలా సాగిందనే చెప్పొచ్చు.

భారత్ - పాక్ మ్యాచ్ రద్దు

- నేను ఆడేదిలేదని చెప్పా : శిఖర్ ధావన్

స్పోర్ట్స్ డెస్క్ : వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో భారత్ – పాకిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. టీమిండియా మాజీ క్రికెటర్లు ఈ మ్యాచ్‌లో ఆడేందుకు విముఖత చూపడమే కారణమంటూ డబ్ల్యూసిఎల్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరూ ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం వద్దకు రావొద్దని సూచించారు. టికెట్ సొమ్మును మొత్తం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. తాను పాక్‌తో ఆడనని మే 11నే చెప్పానని శిఖర్ ధావన్ పోస్టు చేసిన కొద్దిసేపటికే డబ్ల్యూసిఎల్ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

యువరాజ్ సింగ్ నాయకత్వంలో టీమిండియా ఛాంపియన్స్ టోర్నీ బరిలోకి దిగింది. తొలి మ్యాచ్ పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో కావడం గమనార్హం. అయితే, ఈ మ్యాచ్‌లో తాను ఆడేది లేదని.. ఈ విషయాన్ని డబ్ల్యూసిఎల్ ఆర్గనైజర్లకు ఇప్పటికే చెప్పినట్లు శిఖర్ ధావన్ వెల్లడించాడు. మే 11నే లీగ్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినట్లు మెయిల్ స్క్రీన్‌షాట్‌లను ధావన్ పంచుకున్నాడు. 'ఈ లీగ్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడకూడదని మే 11నే నిర్ణయం తీసుకున్నా. ఇప్పటికీ అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నా. నాకు నా దేశమే ముఖ్యం. దేశం కంటే ఏదీ ఎక్కువ కాదు. జై హింద్' అని మెయిల్ స్క్రీన్‌షాట్‌ను ధావన్ పోస్టు చేశాడు.

ముందు నుంచీ విమర్శలు

మాజీలందరూ పాల్గొనే ఈ టోర్నీకి ఇంగ్లాండ్ వేదిక. పాకిస్థాన్‌తో ఎలాంటి క్రికెట్ ఆడకూడదని ఇప్పటికే బిసిసిఐ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం దాడి తర్వాత బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఇప్పుడు డబ్ల్యూసిఎల్‌లో ఇరు జట్లూ తలపడనున్న నేపథ్యంలో చాలా విమర్శలు వచ్చాయి. అసలు పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు మాజీ క్రికెటర్లకు ఎవరు అనుమతిచ్చారంటూ? ప్రశ్నలు తలెత్తాయి. ఇప్పుడు మ్యాచ్ కూడా రద్దు కావడం గమనార్హం. ఇరు జట్లకూ చెరొక పాయింట్ ఇచ్చారా? అనేది డబ్ల్యూసిఎల్ నిర్వాహకులు స్పష్టత ఇవ్వలేదు.

2031 వరకు డబ్ల్యుటిసి ఫైనల్స్ ఇంగ్లండ్‌లోనే

- ఐసిసి ప్రకటన

న్యూఢిల్లీ : ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ 2031 వరకు ఇంగ్లండ్‌లోనే జరుగుతాయని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ప్రకటించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) 2019 మొదలవగా.. ఇప్పటి వరకు జరిగిన మూడు ఫైనల్స్‌కు ఇంగ్లాండ్ ఆతిథ్యమిచ్చింది. రాబోయే మూడు డబ్ల్యుటిసి (2027, 2029, 2031) ఫైనల్ మ్యాచ్‌ల ఆతిథ్య హక్కులను కూడా ఇంగ్లాండ్ దక్కించుకుంది. గత మూడు ఎడిషన్లలో ఇసిబి ట్రాక్ రికార్డ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐసిసి ప్రకటించింది. గత మూడు డబ్ల్యుటిసి ఫైనల్స్ సౌథాంప్టన్ (2021), ది ఒవల్ (2023), లార్డ్స్ (2025) వేదికగా జరిగిన విషయం తెలిసిందే. గత నెలలో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్‌లో సౌతాఫ్రికా విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతకుముందు రెండు ఎడిషన్లలో భారత్ ఫైనల్‌కు చేరగా.. 2021లో న్యూజిలాండ్, 2023లో ఆస్ట్రేలియా ఛాంపియన్‌గా నిలిచాయి.

మురళీ శ్రీశంకర్ 'సూపర్' జంప్..

- పోర్చుగల్ అథ్లెటిక్స్‌లో విజయం

స్పోర్ట్స్ డెస్క్: భారత లాంగ్ జంప్ అథ్లెట్ మురళీ శ్రీశంకర్ అద్భుత ప్రదర్శన చేశాడు. పోర్చుగల్ వేదికగా వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ పోటీల్లో విజేతగా నిలిచాడు. అంతేకాకుండా తన అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేశాడు. శ్రీశంకర్ తొలి రౌండ్‌లో 7.63 మీటర్లు జంప్ చేశాడు. ఇక రెండో రౌండ్‌లో 7.75 మీటర్లు దూకి టాపర్‌గా నిలిచాడు. ఆ తర్వాత 7.69 మీటర్లు జంప్ చేసిన అతడు.. నాలుగో రౌండ్‌లో ఫౌల్ అయ్యాడు.

ఐదో రౌండ్‌లో 6.12 మీటర్లు, ఆరో రౌండ్‌లో 7.58 మీటర్లు జంప్ చేశాడు. దీంతో 7.75 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శన చేసిన శ్రీశంకర్ విజేతగా నిలిచాడు. పోలాండ్ అథ్లెట్ పియోటర్ టార్కోవ్స్కి, ఆస్ట్రేలియాకు చెందిన క్రిస్ మిట్రెవ్స్కి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. గాయం కారణంగా శ్రీశంకర్ గతేడాది పారిస్ ఒలింపిక్స్‌కు దూరమైన సంగతి తెలిసిందే.

ఆకాశ్, అర్ష్‌దీప్ ఔట్?

- గాయాల పాలైన భారత పేసర్లు
- యువ పేసర్ అన్షుల్‌కు పిలుపు

మాంచెస్టర్ : మాంచెస్టర్ టెస్టుకు సన్నద్ధమవుతున్న భారత్‌కు బౌలింగ్ బెడద పట్టుకుంది. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్, పని భారం సమన్వయం కోసం ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో మూడు మ్యాచులే ఆడాల్సి ఉంది. మూడు టెస్టుల్లో రెండింట ఆడిన బుమ్రా.. చివరి రెండు టెస్టుల్లో ఒక్క మ్యాచ్‌లోనే బరిలోకి దిగనున్నాడు. స్టార్ పేసర్ లేకుండా కీలక రెండు టెస్టుల్లో వికెట్ల వేట సాగించటంపై భారత జట్టు మేనేజ్‌మెంట్ ఇప్పటికే తికమక పడుతుండగా.. ఫామ్‌లో ఉన్న ఆకాశ్ దీప్, బెంచ్‌పై ఉన్న అర్ష్‌దీప్ సింగ్‌లు ఏక కాలంలో గాయాల బారిన పడ్డారు. దీంతో మాంచెస్టర్ టెస్టులో టీమ్ ఇండియా పేస్ బౌలింగ్ దళంపై ఆందోళన నెలకొంది.

ఇద్దరూ కష్టమే..! : యువ పేసర్ ఆకాశ్ దీప్ ఫిట్‌నెస్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో వైద్య పరీక్షల్లో ఆకాశ్ దీప్ గజ్జల్లో గాయానికి గురైనట్టు తేలింది. దీంతో నాల్గో టెస్టులో ఆడేది అనుమానంగా మారింది. మరోవైపు అరంగేట్రం కోసం ఎదురు చూస్తున్న పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అనూహ్యంగా గాయంబారిన పడ్డాడు. లార్డ్స్ టెస్టు అనంతరం లండన్‌లోని ఓ గ్రౌండ్‌లో టీమిండియా సాధన చేసింది. బౌలింగ్ చేస్తుండగా అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్ ఆర్మ్‌కు గాయమైంది. బుధవారం నుంచి భారత్, ఇంగ్లాండ్ నాల్గో టెస్టు ఆరంభం కానుండగా.. సోమవారం జరిగే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వారు నాల్గో టెస్టుకు అందుబాటులో ఉంటారా లేదా? అనేదానిపై స్పష్టత రానుంది.

అన్షుల్‌కు పిలుపు : ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్ గాయాల బారిన పడగా.. యువ పేసర్ అన్షుల్ కంబోజ్ (24)కు సెలక్టర్లు పిలుపు అందించారు. భారత్–ఎ తరపున ఇంగ్లాండ్–ఎతో రెండు అనధికార టెస్టుల్లో ఆడిన అన్షుల్.. ఆల్‌రౌండర్‌గా మెప్పించాడు. రెండో టెస్టులో నాలుగు వికెట్ల ప్రదర్శనతో పాటు తనుష్ కొటియన్‌తో కలిసి అజేయంగా 149 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68